www.vishalabharati.com
epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
09 ఆగస్టు 2023
సంపుటి:1 సంచిక:290

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## వరద నష్టం అంచనాపై కసరత్తు జరుగుతోంది

**-హైకోర్టుకు ప్రభుత్వం నివేదిక**

**తెలంగాణ బ్యూరోవిశాల భారతి:** ఇటీవల భారీ వర్షాలు, వరదల సందర్భంగా పూర్తి అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు.. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉన్నట్లు హైకోర్టుకు ప్రభుత్వం తెలిపింది. డాక్టర్ చెరుకు సుధాకర్ వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ప్రభుత్వం తరపున రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా హైకోర్టుకు నివేదిక సమర్పించారు. వాతావరణ శాఖ హెచ్చరికల

..మిగతా |2| లో



## తెలంగాణ సంపన్నుడు..

### ఫోర్బ్స్ జాబితాలో దివీస్ మురళి

### రూ. 53 వేల కోట్ల నికర నిలువ



**నేషనల్ బ్యూరో-విశాల భారతి:**

పదివేల రూపాయిల ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్‌తో గడుస్తున్న కుటుంబం. 14 మంది కుటుంబసభ్యులు. అందులో ఒక పిల్లాడు. అతని ఆశయాలు చాలా గొప్పవి కానీ వాటిని సాధించే పరిస్థితులు మాత్రం అంతంతమాత్రమే. మచిలీపట్నంలో ఇంటర్ సెకెండియర్ రెండుసార్లు ఫెయిల్ అయ్యాడు.. అయినా ఏదో సాధించాలన్న అతని తపన.. ఆ తర్వాత మణిపాల్ హైయర్ స్టడీస్ కాలేజీలో చేరి బీఎస్సి చదివాడు. అదే అతని జీవితంలో అనుకోని మలుపుకి దారితీసింది. ఇంటర్ రెండుసార్లు ఫెయిల్ అయిన అదే కుర్రాడు నేడు అపరకోటీశ్వరుడిగా నెలకొనడానికి పునాది వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఓ చిన్న టౌన్‌కు చెందిన మురళీ దివి.. నేడు ఫోర్బ్స్ జాబితాలో హైదరాబాద్‌లోనే అత్యంత కోటీశ్వరుడిగా నిలిచారు. రూ. 53 వేల కోట్ల ఆస్తితో మురళీ దివి భారతీయులు ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఒకరోజులో, ఒక ఏడాదిలో జరిగిన పరిణామం కాదిది. నలభై ఏళ్ళ సుదీర్ఘ శ్రమతో ఏర్పడిన సామ్రాజ్యం. అదే.. దివీస్ ల్యాబ్స్. చిన్నప్పుడు పెద్దగా చదువు ఒంటబట్టని మురళీ.. ఒకానొక సందర్భంలో అతని అన్నలాగే తను కూడా బీఎస్సీ చదవాలని నిశ్చయించి మణిపాల్ కాలేజీలు చేరాడు. అప్పటికే పద్నాలుగు మంది సభ్యులున్న కుటుంబం వారిది. వాళ్ళ నాన్నగారు ప్రభుత్వోద్యోగి. పదివేల పెన్షన్. ఆ డబ్బుతోనే కుటుంబం గడవాలి. ఆ డబ్బుతోనే నెట్టుకుని వచ్చారు. డిగ్రీ అయిన తర్వాత మురళి ఓ సంస్థలో ఫార్మసిస్ట్‌గా ఉద్యోగం చేశారు. అప్పుడు అతని జీతం

..మిగతా |2| లో



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పై పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. అసెంబ్లీని చిల్లర వేదికగా మార్చారని ఫైర్ అయ్యారు. తాను చంద్రబాబు శిష్యుడిని కాదని.. సహచరుడినని చెప్పారు. తెలంగాణ సమాజం కోసం అహర్నిశలు పరితపించిన వ్యక్తి గద్దర్ అని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మరణ వార్త తెలిసినా అసెంబ్లీలో సీఎం కేసీఆర్ నివాళులు అర్పించలేదని రేవంత్ రెడ్డి అన్నారు.

# అసెంబ్లీలో చిల్లర మాటలు..

## కేటీఆర్, కేసీఆర్ నన్నే టార్గెట్ చేశారు

- చంద్రబాబు శిష్యుడిని కాదు.. సహచరుడిని
- నేను తెలంగాణ వ్యతిరేకిని కాదు
- కేసీఆర్ క్రిమినల్ పొలిటీషియన్ అని గద్దర్ చెప్పేవారు
- పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కామెంట్స్

### నన్ను అలా అంటే సమాజం నమ్మదు

సమైక్య రాష్ట్రానికి మద్దతు ఇచ్చిన జగన్ కు ప్రగతి భవన్ పిలిచి భోజనం పెట్టింది కేసీఆర్. తెలంగాణ ద్రోహులతో అంటకాగిన కేసీఆర్ దుర్మార్గుడు. లాలూచీలో కేసీఆర్ ను మించినవారు ఈ దేశంలో ఇక పుట్టరు. మీరా తెలంగాణపై నా నిబద్దత గురించి మాట్లాడేది. 2014 కు పూర్వం మేం ఏం మాట్లాడినా తెలంగాణ కోసమే మాట్లాడాం. నన్ను తెలంగాణ వ్యతిరేకి అంటే తెలంగాణ సమాజం నమ్మదు. ఏ రోకటి కాడ ఆ పాట పాడే వ్యక్తి కేసీఆర్.

**న్యూఢిల్లీ -విశాలభారతి:**

కేసీఆర్, కేటీఆర్ అసెంబ్లీని చిల్లర మల్లర రాజకీయాలకు వేదికగా మార్చారని అన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరపడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ను కేసీఆర్, కేటీఆర్ అభ్యంతరకరంగా దూషించారని అన్నారు. అసెంబ్లీలో తండ్రీ కొడుకులు చర్చ మొత్తాన్ని రేవంత్ రెడ్డి చుట్టూనే తిప్పారని అన్నారు. తనను, కాంగ్రెస్ ను దూషించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

**అప్పట్లో చంద్రబాబు అనుచరుడిగా కేసీఆర్**

"టీడీపీలో తాను చంద్రబాబు నాయుడుకు శిష్యుడిని కాదు.. సహచరుడిని అన్నారు. ఎమ్మెల్సీగా గెలిచాకే నేను టీడీపీలో చేరాను. కానీ టీడీపీలో కేసీఆర్ ప్రస్థానం చంద్రబాబు అనుచరుడిగా మొదలైంది. నిలువ నీడ లేని కేసీఆర్ కు టీడీపీనే ఆధారం అయింది. తెలంగాణ పట్ల నా నిబద్ధత ఎప్పుడూ మారలేదు. తెలంగాణ సమస్యలపై ప్రశ్నించడంలో నేను ముందున్నా. కానీ, కేసీఆర్ చంద్రబాబుతో ఉన్నప్పుడు 610 జీవోపై తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీసేలా వ్యవహరించారు. 1996లో 610 జీవోను, జోనల్ విధానం రద్దు చేయాలని అసెంబ్లీలో మాట్లాడిన ద్రోహి కేసీఆర్. 1996 లో మంత్రిగా కేసీఆర్ మాట్లాడిన మాటలు వినాలని కేటీఆర్ కు సూచిస్తున్నా. సోనియా వల్లనే తెలంగాణ సాకారమైందని 13 జూన్ 2014లో శాసన సభలో కేసీఆర్ చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ను, రేవంత్ రెడ్డిని దోషిగా ఎలా నిలబెడతారు? తెలంగాణ కోసం 2011లో అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నది, నిలదీసింది నేనే. చంద్రబాబు సహచరుడిగా ఉన్నా ఆనాడు తెలంగాణపై నా నిబద్ధత మారలేదు. ఆనాడు గవర్నర్ పై దాడి ఘటనలో సభ

..మిగతా |2| లో



## మైనార్టీలకు గుడ్‌న్యూస్..

- ఈ నెల 16 నుంచి రూ.1 లక్ష ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

**హైదరాబాద్‌విశాల భారతి:** మైనార్టీలకు రూ.లక్ష ఆర్థికసాయం ఈ నెల 16 నుంచి ప్రారంభించనున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. మొదటి విడతలో పది వేల మంది లబ్ధిదారులకు చెక్కులు అందించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత

..మిగతా |2| లో




## ఎకరం 100 కోట్లు అంతా భోగస్..

- రియల్ ఎస్టేట్ పెంచేందుకు డ్రామాలు
- విపక్షాలపై దాడికే అసెంబ్లీ సమావేశాలు
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల

**హైదరాబాద్- విశాల భారతి:**

హైదరాబాద్‌లో ఎకరం 100 కోట్లు అంతా భోగస్ అని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పెంచేందుకు ఈ ఎత్తుగడలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. చట్టసభలపై సీఎం కేసీఆర్‌కు నమ్మకం సన్నగిల్లిందని బీజేపీ ఎమ్మెల్యే, ఆ పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ విమర్శించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు 11 రోజులు, వర్షాకాల సమావేశాలు 3 రోజులు.. ఇలా ఈ ఏడాది మొత్తం 14 రోజులు మాత్రమే జరిగాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏడాదికి 60 రోజుల పాటు సమావేశాలు నిర్వహించేవారని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈటల మాట్లాడారు. 'ధరణి పేదల కోసం కాదు.. పెద్దల కోసం. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జిల్లాల కలెక్టర్లకు టార్గెట్లు పెట్టారు. ఎమ్మెల్యేలంటే నియోజకవర్గాల్లో ఉంటూ పోలీసుస్టేషన్లకు ఫోన్ చేసే వాళ్లుగా మార్చారు. అసెంబ్లీలో నేడు 4 పార్టీలే ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 15 పార్టీలు ఉండేవి. అన్ని పార్టీలతో బీఏసీ సమావేశం నిర్వహించేవారు. లోక్‌సత్తా నుంచి ఒక్క ఎమ్మెల్యేగా ఉన్న జయప్రకాశ్ నారాయణ కూడా బీఏసీలో పాల్గొనేవారు. నేడు జాతీయ పార్టీగా ఉన్న బీజేపీకు బీఏసీకి ఆహ్వానం లేదు. బీజేపీ సభ్యులకు అసెంబ్లీలో ఒక గది కేటాయించాలని వేడుకున్నా పట్టించుకోవడం లేదు.

**ఆ మూడు రోజులూ ప్రతిపక్షాలపై దాడికే..**

సభ సజావుగా సాగిందని అధికార పార్టీ నేతలు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ప్రభుత్వాన్ని అధికార పార్టీ సభ్యుల కంటే ఎంఐఎం సభ్యులు పొగడటం జుగుప్సాకరంగా ఉంది. ప్రజలు, ప్రజాస్వామ్యం, చట్టసభలపై భారాస నేతలకు నమ్మకం లేదు. వరదల్లో 41 మంది కొట్టుకుపోయినా సభలో కనీసం సంతాపం తెలపలేదు. రానున్న ఎన్నికల్లో 109 సీట్లు వస్తాయని కేసీఆర్ అహంకారంతో చెబుతున్నారు. మూడు రోజులు సభ జరిగితే ఒకటో రోజు హరీశ్‌రావు.. రెండో రోజు కేటీఆర్.. మూడో రోజు కేసీఆర్ ప్రతిపక్షాలపై దాడి చేయడానికే సరిపోయింది.

# పాత ఇంటికే రాహుల్

## ఆయన ఖాళీ చేసిన ఇంటిని తిరిగి ఆయనకే కేటాయింపు

**-కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడి**





**న్యూఢిల్లీవిశాల భారతి:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని పునరుద్ధరించిన నేపథ్యంలో గతంలో ఆయన ఖాళీ చేసిన ఇంటిని తిరిగి ఆయనకే కేటాయించినట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ హౌసింగ్ కమిటీ.. దిల్లీలోని 12తుగ్లక్‌లేన్ లోని అధికారిక బంగ్లాను తిరిగి రాహుల్‌కు కేటాయించిందని తెలిపాయి. పరువునష్టం కేసులో రాహుల్‌కు సూరత్ కోర్టు 2 ఏళ్ల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఆయనపై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గత ఏప్రిల్‌లో రాహుల్ తన

..మిగతా |2| లో



## బీజేపీ మహిళా నేత మిస్సింగ్..

### మహారాష్ట్రలో కలకలం

2

## 'మందు పోయించను.. పైసలు పంచను..'



### వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తా...మంత్రి కేటీఆర్

**సిరిసిల్ల-విశాల భారతి:**

ప్రజల దయ ఉంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తానని మంత్రి కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఒక వేళ గెలవకపోతే ఇంట్లో ప్రశాంతంగా కూర్చుంటానని ఆయన పేర్కొన్నారు. అంతే గానీ మందు పోయించి.. పైసలు పంచే చిల్లర రాజకీయం మాత్రం చేయనని కేటీఆర్ పునరుద్ఘాటించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించిన ఆయన.. అర్హులైన బీసీలకు బీసీ బంధు కింద రూ. లక్ష చెక్‌లు పంపిణీ చేశారు. పని చేసే ప్రభుత్వాలను ప్రజలు కాపాడుకోవాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రజలకు సూచించారు. ఓట్ల కోసం మందు పోయించి, పైసలు పంచేవారిని నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన.. అనంతరం లబ్ధిదారులకు బీసీ బంధు పథకం చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడిన మంత్రి.. కేసీఆర్ సీఎంగా ఉన్నంత వరకు రాష్ట్రానికి ఎటువంటి ఢోకా ఉండదని అభిప్రాయపడ్డారు. వేముల నియోజకవర్గంలో తొలి విడతలో 600 మందికి బీసీ బంధు కింద చెక్కులు పంపిణీ చేయడం జరుగుతోందని.. అనంతరం మరోసారి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గంలో 800 ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని ప్రకటించారు. గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల సాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద వేములవాడ

..మిగతా |2| లో

## వరద నష్టం అంచనాపై కసరత్తు జరుగుతోంది

మొదటిపేజీ తరువాయి

ఆధారంగా వర్షాలపై జిల్లా అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. పరిస్థితి తీవ్రత ఉన్న ప్రాంతాలకు ముందస్తుగా పది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, రెండు హెలికాప్టర్లతో పాటు రాష్ట్ర పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బందిని పంపించినట్లు పేర్కొంది. పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు హైకోర్టుకు ప్రభుత్వం నివేదించింది. జిల్లా అధికార యంత్రాంగం ముందుగానే సహాయక శిబిరాలు, అవసరమైన వైద్య, ఆహార ఏర్పాట్లను సిద్ధం చేశాయని ప్రభుత్వం నివేదికలో తెలిపింది. వరదల సమయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఐఏఎఫ్, పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది.. రెండు హెలికాప్టర్లు, 27 బోట్లలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని నివేదికలో ప్రభుత్వం తెలిపింది.

## తెలంగాణ సంపన్నుడు..

మొదటిపేజీ తరువాయి

నెలకు 250 రూపాయిలు. 1976లో మురళి తన 25వ ఏట అమెరికా వెళ్ళి ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ టైంలో మురళి చేతిలో ఉన్న డబ్బు 500 వందల రూపాయిలు. తెలిసినవాళ్ళ సహాయ సహకారంతో మురళి అమెరికాకి వెళ్ళగలిగారు. అక్కడ ట్రినిటీ కెమికల్స్, ఫైక్ కెమికల్స్ వంటి సంస్థల్లో ఫార్మసిస్ట్‌గా జాబ్ చేశారు. అతి తక్కువ కాలంలోనే ఏటా 65 వేల డాలర్ల జీతం గడించే స్థాయికి చేరుకున్నారు. ఆ తర్వాత మురళి దివి పలు ఫార్మసిటికల్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ సైంటిస్ట్‌గా ఎదిగారు. 1984 లో మురళి 40 వేల డాలర్లతో ఇండియాకు తిరిగి వచ్చారు. ఒక స్నేహితుడితో కలిసి కెమినార్ అనే సంస్థను స్థాపించారు. 1989లో కెమినార్ సంస్థను రెడ్డి ల్యాబ్స్ టేకోవర్ చేసింది. అక్కడి నుంచి మురళీ దివి రెడ్డి ల్యాబ్స్‌లో ఆరేళ్ళ పాటు పనిచేశారు. 1995 లో మురళీ రెడ్డి ల్యాబ్స్ నుంచి బయటికి వచ్చి సొంతంగా దివీస్ ల్యాబ్స్ అనే సంస్థను నెలకొల్పారు. హైదరాబాద్ చౌటుప్పల్‌లో మొదటి ఫ్యాక్టరీని 1995లో స్థాపించారు. ఆ తర్వాత ఏడేళ్ళకి అంటే.. 2002 లో దివీస్ ల్యాబ్స్ రెండో ఫ్యాక్టరీని విశాఖపట్నంలో స్థాపించారు.

ప్రపంచం ఫార్మసిటికల్ రంగానికి అవసరమైన క్రియాశీలక ఔషద పదార్థాల ఉత్పాదన, సరఫరా చేసే ప్రముఖ సంస్థగా దివీస్ ల్యాబ్స్ ఎదిగింది. 2022లో దివీస్ ల్యాబ్స్ ఏకంగా 88 బిలియన్ల (8800 కోట్లు) వ్యాపారాన్ని చేసి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలో మురళీ దివి కీ చోటు కల్పించింది. ప్రస్తుతం మురళీ దివి 53 వేల కోట్ల ఆస్తులతో హైదరాబాద్‌లోనే అత్యంత సంపన్నుడిగా పేరుగాంచారు.



## మైనార్టీలకు గుడ్‌న్యూస్..

మొదటిపేజీ తరువాయి

అధికారులను ఆదేశించారు. శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ మేరకు మైనార్టీల సమస్యలపై చర్చించేందుకు నేడు పలువురు మంత్రులు సచివాలయంలో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని ఇతర వర్గాలతో సమానంగా మైనార్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో శ్రద్ధ వహిస్తున్నారని మంత్రి హరీశ్ రావు తెలిపారు. శ్మశాన వాటికలకు 125 ఎకరాల కేటాయింపు, గౌరవ వేతనం పొందే ఇమామ్‌లు మౌజామ్‌ల సంఖ్య పెంపు వంటి హామీలను ఇప్పటికే ప్రభుత్వం పూర్తి చేసిందని అన్నారు. మైనార్టీల సంక్షేమంలో భాగంగా రూ.లక్ష ఆర్థిక సాయం కార్యక్రమాన్ని అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మొదటి దశలో భాగంగా ఎంపిక చేసిన పది వేల మంది లబ్ధిదారులకు ఈ నెల 16వ తేదీ నుంచి చెక్కుల పంపిణీ ప్రారంభించాలని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు ఇప్పటికే కేటాయించిన రూ.270 కోట్లకు అదనంగా, మరో రూ.130 కోట్లు కేటాయించి.. మొత్తం రూ.400 కోట్లను కార్యక్రమం అమలుకు కేటాయించాలని ఆర్థికశాఖను మంత్రి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో జనాభా దామాషా ప్రకారం ఆర్థికసాయం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగాలని చెప్పారు. మైనార్టీల జనాభా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలపై మరింతగా దృష్టి సారించాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమంపై అధికారులతో సమీక్ష నిర్వహించాలని సీఎస్ శాంతి కుమారిని కోరారు. రాష్ట్రంలో శ్మశాన వాటికలు, ఈద్గాల భూముల కోసం వచ్చిన మొత్తం వినతులను క్రోడీకరించాలని, పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.



## పాత ఇంటికే రాహుల్

మొదటిపేజీ తరువాయి

అధికారిక బంగ్లాను ఖాళీ చేసి... 10 జన్‌పథ్‌లోని తన తల్లి, కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీ నివాసంలో ఆమెతోపాటే ఉంటున్నారు. తాజాగా అతడిపై అనర్హత వేటును తొలగించిన నేపథ్యంలో తిరిగి అదే బంగ్లాను ఆయనకు కేటాయించినట్లు తెలుస్తోంది. 2005 నుంచి ఏప్రిల్‌లో ఖాళీ చేసేంతవరకు రాహుల్ అదే బంగ్లాలో నివాసమున్నారు. అయితే, హౌసింగ్ కమిటీ తిరిగి బంగ్లా కేటాయించినప్పటికీ.. ఆయన అందులోకి మారతారా? లేదంటే తల్లితోపాటు 10 జన్‌పథ్‌లోనే ఉంటారా? అనేదానిపై స్పష్టత లేదు.



## పేదింటి ఆడబిడ్డకు అండగా కళ్యాణ లక్ష్మి ఎమ్మెల్యే చిరుమర్తి

**-- కళ్యాణ లక్ష్మి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**కట్టంగూర్ విశాలభారతి:** పేదింటి ఆడబిడ్డ కి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ కొండంత అండగా నిలుస్తున్నాయని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కట్టంగూర్ మండంలోని వివిధ గ్రామాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 22 మంది లబ్ధిదారులకు మంజూరైన 6లక్షల విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమ, ఆసరా పెన్షన్లు, దళిత బంధు వంటి అనేక సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల లో వెలుగులు నింపారని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపిపి జెల్లా ముత్తిలింగం, జడ్పీటీసీ తరాల బలరాం, మండల పార్టీ అధ్యక్షులు ఊట్కూరి ఎడుకొండలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నరసింహ, పిఎసిఎస్ చైర్మన్ నూక సైదులు, వైస్ ఎంపీపీ కోటి రెడ్డి, మండల ఎంపిటిసిల అధ్యక్షులు పాలడుగు హరికృష్ణ బాబు, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గుర్రం సైదులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో చిల్లర మాటలు..

మొదటిపేజీ తరువాయి

నుంచి సస్పెండ్ అయ్యాను. 24 జనవరి 2014లో సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై 54 నిమిషాలు సభలో వివరించా. హైదరాబాద్ తో కూడిన తెలంగాణ రాష్ట్రం కావాలని నొక్కి చెప్పా. అప్పర్ సీలేరు, లోయర్ సీలేరులో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని చెప్పా. ఎవరికి తలవంచకుండా తెలంగాణ కోసం మాట్లాడిన నిఖార్సైన తెలంగాణ బిడ్డను నేను. కేసీఆర్ నిన్ను నమ్మి వచ్చిన వారిని మోసం చేసిన సంగతి మరిచిపోయావా? కేసీఆర్.. నీ పార్టీ బతికిందే కాంగ్రెస్ తో. కాంగ్రెస్ లేకపోతే నువ్వు, నీ కుటుంబం అడుక్కు తినేవారు.

24 సంవత్సరాల నా రాజకీయ ప్రస్తానంలో ఏనాడు నేను తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడలేదు. సమైక్య రాష్ట్రంలో సీమాంధ్ర పాలనపై మాత్రమే నేను విమర్శలు చేశా. కేసీఆర్ తన అవసరానికి ఒకసారి టీడీపీతో, మరోసారి కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకున్నారు. సన్నాయి నొక్కులు నొక్కుతున్న కిషన్ రెడ్డి.. 2011లో కేసీఆర్ తో పొత్తు పెట్టుకుంది నిజం కాదా? శాసన మండలి ఎన్నికల్లో ఓట్లు కిరణ్ కుమార్ రెడ్డికి అమ్ముకున్నది నిజం కాదా? ఉద్యమాన్ని వ్యతిరేకించిన నాయకులను ఇవాళ కేసీర్ అక్కున చేర్చుకున్నారు.

**కావాలనే సంయమనం పాటించా**

గద్దర్ 2019లో మొదలు పెట్టిన తుది దశ తెలంగాణ ఉద్యమం సాకారం కావాలి. గద్దర్ చివరి కోరిక, ఆకాంక్ష నెరవేర్చేందుకు ఆయన స్ఫూర్తిని మేం కొనసాగిస్తాం. నిక్కర్ పార్టీ, లిక్కర్ పార్టీ ఒక్కటయ్యాయని గద్దరన్న నాతో చెప్పారు. యుద్ధం వ్యూహాత్మకంగా చేయాలని నాకు సూచించారు. కేసీఆర్ క్రిమినల్ పొలిటీషియన్ అని.. జాగ్రత్తగా ఉండాలని ఆయన అప్పుడే చెప్పారు. గద్దర్ మరణించారని ఇప్పటివరకు నేను సంయమనం పాటించా. ప్రజా కోర్టులో కేసీఆర్ దోషిగా నిలబడ్డారు.. ప్రజల గుండెల్లో గద్దర్ వీరుడిగా నిలబడ్డారు.

గద్దర్ మరణాన్ని రాజకీయం చేయొద్దనే నేను విజ్ఞత ప్రదర్శించా.. లక్ష్యాన్ని చేరేవరకు కార్యదీక్షతో పనిచేస్తామని కేసీఆర్ ను హెచ్చరిస్తున్నా. నేను లేవనెత్తిన అంశాలపై, తెలంగాణకు కేసీఆర్ చేసిన ద్రోహంపై అమరవీరుల స్థూపం వద్ద చర్చకు సిద్ధం. నువ్వు వస్తావో, కేటీఆర్ ను పంపుతావో.. హరీష్ ను పంపుతావో తేల్చుకో. ఈసారి వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ కు 25కు మించి సీట్లు రావు. అందుకే కేసీఆర్ కాంగ్రెస్ పై దాడి చేస్తున్నారు" అని రేవంత్ రెడ్డి మాట్లాడారు

## 'మందు పోయించను.. పైసలు పంచను..'






మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గంలో 3 వేల మంది లబ్ది పొందినట్లు గుర్తు చేశారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పరిపాలన సంక్షేమంలో స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చునని కొనియాడారు. పేదలను దృష్టిలో పెట్టుకొని కొన్ని కులవృత్తుల వారి కోసం పథకాలు తీసుకొచ్చినట్లు కేటీఆర్ వెల్లడించారు. ఆర్థికంగా అడుగున ఉన్న వారి కోసం దళితబంధు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. 14 రకాల వృత్తులపై ఆధారపడిన వారి కోసం బీసీ బంధు అమలు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. బీసీ బంధు కోసం జిల్లాలో 10 వేల దరఖాస్తులు వచ్చాయని.. తొలి విడతలో 600 మందికి ఇస్తున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా విపక్షాలపై తనదైన శైలిలో కేటీఆర్ విరుచుకుపడ్డారు. గత 50 ఏళ్లుగా అభివృద్ధి చేయని పార్టీలు.. ఇప్పుడేం చేస్తాయని నిలదీశారు. ఓట్ల కోసం విపక్ష నేతలు వచ్చినప్పుడు ప్రజలు నిలదీయాలని సూచించారు. ప్రజలు చైతన్యం ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ అండగా ఉంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేటీఆర్ వెంట స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## విద్యార్థులు,యువత జీవితాల్లో వెలుగులు నింపుతాం..

**-బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్...**




**వరంగల్ విశాల భారతి:** బీఎస్పీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని లక్షలాదిమంది విద్యార్థులు ,యువత జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. హన్మకొండలోని డా.నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో మంగళవారం జరిగిన బహుజన విద్యార్థి గర్జనకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.తదనంతరం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.రాష్ట్రంలోని విద్యార్థులు,యువత కోసం పార్టీ ఎన్నికల డిక్లరేషన్‌ను ప్రకటించారు. లక్షలాది మంది పేద విద్యార్థులు, యువతకు జీవితాల్లో మార్పుతేవడానికే పార్టీ డిక్లరేషన్ ప్రకటించినట్లు తెలిపారు.మహాత్మ జ్యోతిరావ్ పూలే విద్యా భరోసా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రపంచంలోని అగ్రశ్రేణి యూనివర్శిటీల్లో పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు.పేద విద్యార్థుల కలగా మిగిలిపోకూడదన్న లక్ష్యంతో ప్రతి మండలం నుంచి ఐదుగురు విద్యార్థులను విదేశీ విద్యకు ఎంపిక చేస్తామన్నారు.ప్రతి జిల్లాకు ఒక సైనిక పాఠశాల ఏర్పాటు చేస్తామని,ప్రతి ఏడాది ఒక విద్యార్థిపై 75 వేల రూపాయలు ఖర్చు చేస్తామన్నారు.పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు నాలుగో భాషగా కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెడతామన్నారు.విద్యార్థులకు మెట్రోతో సహా, ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పిస్తామన్నారు. అన్ని గ్రామాలల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు రీడింగ్,కోచింగ్ కేంద్రాల కోసం జాంబవ స్టూడెంట్ స్పార్క్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగ హక్కు చట్టం తీసుకువచ్చి,రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.ప్రతి గ్రామంలో విద్యార్థుల కోసం ఏసీ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

### 70 శాతం పైగా స్కోరు వారికే

## నియామక ఉత్తర్వులు

**-జూనియర్ పంచాయతీరాజ్ కార్యదర్శుల క్రమబద్ధీకరణ**
**-పంచాయతీరాజ్ శాఖ కలెక్టర్లకు ఆదేశాలు జారీ**




**తెలంగాణ బ్యూరో విశాల భారతి:** రాష్ట్రంలో ఉన్న 9,355 మంది జూనియర్ పంచాయతీరాజ్ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే 70 శాతానికి పైగా స్కోరు సాధించిన వారికే నియామక ఉత్తర్వులు అందించాలని పంచాయతీరాజ్ శాఖ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికులు రేపటి నుంచి విధుల్లో చేరనున్నారు. మరోవైపు రేపటి నుంచి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హామీ మేరకు గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు విధుల్లో చేరనున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నిర్దేశించిన అంశాల్లో జిల్లా స్థాయి మూల్యాంకన కమిటీ చేసిన పరిశీలనలో 70 శాతానికి పైగా స్కోరు వచ్చిన వారికి నియామక ఉత్తర్వులు జారీ చేయాలని తెలిపింది. 70 శాతం కంటే తక్కువ స్కోరు చేసిన వారి పనితీరును మరో ఆర్నెళ్ల పాటు పరిశీలించాలన్న ప్రభుత్వం.. ఆ తర్వాత మరోమారు మూల్యాంకనం చేయాలని పేర్కొంది. వారి పనితీరు సంతృప్తికరంగా అనిపిస్తే తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. జేపీఎస్‌ల పనితీరు, వివరాలు అన్నింటినీ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్న పంచాయతీరాజ్ శాఖ.. క్రమబద్ధీకరణ నియామక ఉత్తర్వులను పొందుపర్చాలని తెలిపింది. 2018 ఆగస్టు 31వ తేదీన డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో నియామకమై నాలుగేళ్లు పూర్తి చేసుకొని 70 శాతానికి పైగా స్కోరు సాధించిన వారిని మాత్రమే క్రమబద్ధీకరించాలని స్పష్టం చేసింది.

**రేపటి నుంచి విధుల్లోకి..**

రేపటి నుంచి విధుల్లో చేరనున్నట్లు గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల ఐకాస ప్రకటించింది. ఈ మేరకు ఉద్యోగ, కార్మికుల ఐకాస ప్రతినిధులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు లేఖ రాశారు. సీపీఎం నేతలు జూలకంటి రంగారెడ్డి, సీతారాములు ఆధ్వర్యంలో నిన్న ఐకాస ప్రతినిధులు మంత్రి ఎర్రబెల్లిని కలిశారు. ఆర్థికపరమైన అంశాలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, ఇతర అంశాలను పరిశీలిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని మంత్రి వారికి విజ్ఞప్తి చేశారు. మంత్రి దయాకర్ రావు సూచన మేరకు సమ్మె విరమిస్తున్నట్లు ఐకాస ప్రతినిధులు ప్రకటించారు. దీంతో గత 34 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమించి రేపటి నుంచి విధుల్లోకి చేరనున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక ఐకాస తెలిపింది.

## పేద విద్యార్థికి కవిత అండ..

**- అమెరికా చదువకు ఆర్థిక సాయం**
**- నెటిజన్ల ప్రశంసలు**



**హైదరాబాద్ విశాలభారతి:** దిక్కులేని వారికి దేవుడే దిక్కంటారు. ఈ సందర్భంలో మాత్రం.. దిక్కు తోచని స్థితిలో పడిన ఓ మెరిట్ స్టూడెంట్‌కు.. బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత అండగా నిలబడ్డారు. భుజం తట్టి ప్రోత్సహించారు. అమెరికా పంపించి.. అతని ఉన్నత విద్య అభ్యాసానికి తనవంతు తోడ్పాటుగా నిలిచారు.

నిజామాబాద్‌కు చెందిన సామల రితీష్.. బాగా చదువుకున్నాడు. తన ప్రతిభతో అమెరికాలోని నార్త్ వెస్ట్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ సీటు సాధించాడు. ఇక అమెరికా వెళ్లి ఉన్నత విద్య చదవడమే తరువాయి అన్న తరుణంలో.. కుటుంబ ఆర్థిక సమస్యలు అతన్ని అయోమయంలోకి నెట్టేశాయి. అతని భవిష్యత్ చదువును ప్రశ్నార్థకం చేశాయి. కుటుంబాన్ని పోషించుకునేందుకు అవసరమైన ఖర్చులకు మించి ఆదాయం లేదని ఉద్యోగం చేసే రితీష్ తండ్రి.. తన కుమారుడిని ఎలా అమెరికాకు పంపించాలా అన్న ఆందోళనకు సైతం గురవ్వాల్సి వచ్చింది.

ఈ సమస్య.. ఎమ్మెల్సీ కవిత చెవిన పడింది. మానవత్వంతో వెంటనే స్పందించిన ఆమె.. రితీష్‌కు అండగా నిలిచారు. తమ్ముడికి అక్కగా భుజం తట్టారు. అతని అమెరికా ప్రయాణ ఖర్చులను తానే భరించారు. తన సొంత ఖర్చులతో టికెట్లు సమకూర్చారు. తగిన సమయంలో.. తగిన రీతిలో తమ కుటుంబాన్ని ఆదుకున్నారంటూ కవితకు రితీష్ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

గతంలో కూడా.. నిరుపేద యువతీ యువకులకు కవిత అండగా నిలిచిందంటూ ఆమె అనుచరులు తెలియజేశారు. రితీష్ విషయంలో చూపిన దాతృత్వానికి అందరూ కవితను అభినందిస్తున్నారు.

## ఆర్5జోన్‌లో ఇళ్ల నిర్మాణంపై సుప్రీంకు ఏపీకి సర్కారు

**విశాలభారతి, ఏపీ :** అమరావతి ఆర్5జోన్‌లో ఇళ్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ఇచ్చిన స్టేపై ఏపీ సర్కారు సుప్రీంలో ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌కు సర్వోన్నత న్యాయస్థానం రిజిస్ట్రీ డైరీ నంబర్ కేటాయించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేస్తే తమ వాదనలూ వినాలని రాజధాని రైతులు కోరుతున్నారు. సుప్రీంకోర్టులో ఇప్పటికే వారు కేవియట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.



## బీజేపీ మహిళా నేత మిస్సింగ్..

**– మహారాష్ట్రలో కలకలం**

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** బీజేపీకి చెందిన ఓ మహిళా నేత కనిపించకుండా పోవడం ఇప్పుడు కలకలం రేపుతోంది. మహిళా నేత సనాఖాన్ ది మహారాష్ట్రలోని నాగ్ పూర్. ఆమె తన బిజినెస్ పార్ట్ నర్ అమిత్ అలియాస్ పప్పు సాహును కలవడానికి 2023 ఆగస్టు 1న జబల్‌పూర్ వెళ్లారు. దీంతో సనా ఖాన తల్లి మాన్కాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు పప్పు సాహు కూడా కనిపించకుండా పోయాడు. జబల్‌పూర్‌కు చెందిన కరుడుగట్టిన నేరస్థుడు పప్పు సాహు .. జబల్‌పూర్‌లో అతను దాబా నడుపుతున్నాడు అతనిపై హత్యతో సహా మద్యం అక్రమ రవాణా కేసులు ఉన్నాయి. అయితే ఒక నెల క్రితం సనా ఖాన్ ను చంపేస్తానంటూ ఫోన్ లో బెదిరించాడు. ఆగస్టు 1న అతని నుంచి సనాకు ఫోన్ రావడంతో జబల్‌పూర్‌కు బయలుదేరింది. అక్కడికి చేరుకున్న తన తల్లికి ఫోన్ చేసి మాట్లాడింది. అయితే తిరిగి సాయంత్రం ఫోన్ చేస్తే మాత్రం స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.



## రాహుల్ పార్లమెంట్ కి రావడం ఎంతో అవసరం.

**-వైయస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి.**

హైదరాబాద్‌విశాల భారతి: న్యాయం ధర్మం గెలిచాయన్నానికి సుప్రీంకోర్టు తీర్పు ఒక ఉదాహరణని వైయస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి అన్నారు. రాహుల్ తిరిగి పార్లమెంటుకు రావడం దేశానికి ఎంతో అవసరమన్నారు. పార్లమెంట్ వేదికగా మీ గళం వినిపిస్తారని దేశం ఎదురు చూస్తుందని చెప్పారు. ఆహర్నిశలు ప్రజాస్వామ్య పరిరక్షణ లౌకికవాద పరిరక్షణ దేశభద్రత ఉన్నతి ఐక్యతలపై మీ పోరాట పటిమ ఎంతో ఆదర్శమని కొనియాడారు. దేశ భద్రత ఉన్నతి ఐక్యతపై అందరి నాయకులు కలిపి పోరాడాలని కోరారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి భేషరతుగా నైతిక మద్దతు తెలియజేస్తున్నానని తెలిపారు.



## దేవేందర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందచేత

**ఆర్మూర్, విశాలభారతి:** నందిపెట్ మండలం బజార్ కొత్తూరు గ్రామానికి చెందిన ఉప్పరి దేవేందర్ ఆర్థిక సమస్యతో ఇటీవల మరణించడంతో మంగళవారం నాడు రాకేష్ రెడ్డి ఫౌండేషన్ డైరక్టర్ సుచరిత రెడ్డి 10వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగింది మృతుని పిల్లల చదువుకు కూడా అవసరం మేరకు సహాయం చేస్తా అని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో భూతం సాయిరెడ్డి,చిన్నరెడ్డి,ప్రవీణ్, లక్కంపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.




## ప్రొసీడింగ్స్ కాపీ అందజేత

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్ గ్రామానికి చెందిన ఎస్సి కుల సంఘ భవన నిర్మాణానికి ఎంపీలాడ్స్ నిధుల నుండి మంజూరైన 4లక్షల 95వేల రూపాయల ప్రొసీడింగ్స్ కాపీని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి కుల సంఘ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా కుల సంఘ భవనం నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషిచేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్,ఏలేటి మల్లికార్జున్ రెడ్డికి సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## గ్రాండ్ గా టీపిసిసి వైస్ ప్రెసిడెంట్ బర్త్ డే వేడుకలు

**నారాయణఖేడ్,విశాలభారతి:** టీపిసిసి వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ షేట్కార్ బర్త్ డే వేడుకలు నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో కార్యకర్తలను మధ్యన మంగళవారం గ్రాండ్ గా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని భవాని టెంపుల్ నుండి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారీ గజ మాలతో సత్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బర్త్ డే సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, టిపిసిసి సభ్యులు శంకరయ్య స్వామి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షేట్కార్, సాగర్ షేట్కార్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రమాదంలో గాయపడిన మిత్రునికి అండగా మిత్రబృందం

**షాద్ నగర్,విశాలభారతి:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న మిత్రునికి తోటి స్నేహితులు అండగా నిలిచారు.నియోజకవర్గం కేశంపేట మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన మాధవచారి కొంతకాలం క్రితం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బయటికి వెళ్లి పని చేసుకోలేని పరిస్థితి. అతని ఇబ్బందిని గమనించిన 10తరగతి మిత్రబృందం మంగళవారం అతన్ని పరామర్శించారు. నిత్యావసర సరుకులతో కలిపి సుమారు 10వేలు ఆర్థిక సహాయంగా అందించారు. కార్యక్రమంలో మిత్రులు ఆంజనేయులు, వెంకటేష్, కృష్ణ, రమేష్, మల్లేష్, సంగమేశ్వర్, తైద శ్రీనివాసులు, శివలింగం, కావాలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ సైన్స్ తో దేశ భవిష్యత్తు

- పోటీకి తగిన ప్రమాణాలతో కంప్యూటర్ సైన్స్ అంశాలు
- భారతదేశంలో విప్లవాత్మక విద్య
- దేశ సామర్థ్య వెలికితీతలో డేటా సైన్స్ కోర్సులు కీలకం
- కంప్యూటర్ సైన్స్ రంగం ప్రాముఖ్యతపై ప్రొఫెసర్ వంశీ మోహన విశ్లేషణ



**హైదరాబాద్ ,విశాలభారతి:**

కంప్యూటర్ సైన్స్ రంగం ప్రాముఖ్యతపై అసోసియేట్ ప్రొఫెసర్ టి వంశీ మోహన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ మరియు డేటా సైన్స్ కోర్సుల యొక్క ప్రకాశవంత మైన భవిష్యత్తు గత 28 సంవత్సరాలుగా విద్యావేత్తగా, కంప్యూటర్ సైన్స్ రంగంలో, నేను అంశం యొక్క ప్రాముఖ్యతను మరియు క్షణం క్షణం మారుతున్న వృద్ధిని ఊహించి అంచనా వేశారు. డిజిటల్ యుగం కోసం భారతీయ విద్యార్థులను అత్యాధునిక నైపుణ్యాలతో సన్నద్ధం చేసే ప్రయత్నంలో, కంప్యూటర్ సైన్స్ అంశాలు పోటీకి తగిన ప్రమాణాలతో ఉద్భవించాయి. కంప్యూటర్ సైన్స్ విద్య ముందంజలో ఉండటంతో భారతీయ విద్యా రంగం ఆదర్శప్రాయ మార్పునకు ఆహ్వానం పలికింది. అనేక ప్రయోజనా లను అందిస్తూ, ఈ కోర్సులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రపంచం టెక్నాలజీ ఆధారితంగా మారడంతో, కంప్యూటర్ సైన్స్ కోర్సులు కోడింగ్, అల్గారి థమ్ లు మరియు సమస్య పరిష్కార శక్తిని ఉపయోగించుకునేలా విద్యార్థులను నిపుణులుగా చేస్తాయి. విద్యార్థులు విమర్శ నాత్మక ఆలోచన మరియు విశ్లేషణాత్మక సామర్థ్యాలను పెంపొందించు కుంటున్నారు. వివిధ పరిశ్రమలకు వినూత్న సహకారాలకు పునాది వేస్తున్నారు. ఈ పరిస్థితికి అనుగుణంగా అదనంగా డేటా సైన్స్ కోర్సులు పెరగడం. డేటాఆధారిత ప్రపంచంలో, ఈ కోర్సులు సాంప్రదాయ విభాగాలు మరియు ఆధునిక సాంకేతికత మధ్య అంతరాన్ని పెంచుతాయి. విద్యార్థులు భారీ క్లిష్టమైన డేటాసెట్‌లను విశ్లేషించే సామర్థ్యాలను పొందుతున్నారు. సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడానికి విలువైన అంతర్దృష్టులను పొందుతున్నారు. భారతదేశం ప్రపంచ టెక్ హబ్‌గా మారడానికి ప్రయత్నిస్తున్నందున, కంప్యూటర్ సైన్స్ మరియు డేటా సైన్స్ కోర్సులు దేశం యొక్క సామర్థ్యాన్ని వెలికితీతకు కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి.దూరదృష్టి గల విద్యావేత్తలు మరియు ఆసక్తిగల విద్యార్థులు ఈ పరిణామాన్ని స్వీకరించడంతో, ప్రపంచ వేదికపై భారతదేశానికి భవిష్యత్తు ఉజ్వలంగా ప్రకాశిస్తుంది.



**టి. వంశీ మోహన**
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆర్.బి.వి.ఆర్.ఆర్. మహిళా కళాశాల,
హైదరాబాద్

## అమరుల స్ఫూర్తితో కల్లుగీత కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి



**వలిగొండ,విశాలభారతి:** కష్టజీవుల కోసం , కల్లుగీత కార్మికుల హక్కుల కోసం, సమ సమాజ స్థాపన కోసం పనిచేసి అమరులైన అమరుల స్ఫూర్తితో కల్లుగీత కార్మికులు నేటితరం యువకులు తమ హక్కుల సాధన కోసం సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి బొలగాని జయ రాములు అన్నారు.
మంగళవారం రోజున వలిగొండ మండల కేంద్రంలో కేజీ కేఎస్ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో అమరుల యాధిలో సభ రాష్ట్ర కమిటీ సభ్యులు మండల ప్రధాన కార్యదర్శి గాజుల ఆంజనేయులు గారి అధ్యక్షతన నిర్వహించి బహుజన వీరుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు తెలపడం జరిగింది .ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన జయ రాములు మాట్లాడుతూ అనేకమంది నాయకులు కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిపిన పోరాటల ఫలితంగానే ప్రభుత్వాలు కొన్ని హక్కులు కల్పించాయని అన్నారు. నేడు గీత కార్మికులు అనుభవిస్తున్న వృద్ధాప్య పెన్షన్, ఎక్స్‌గ్రేషియా, పన్ను రద్దు తదితర హక్కులు వారి పోరాట ఫలితమే అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య రాష్ట్ర కమిటీ సభ్యులు మండల ప్రధాన కార్యదర్శి గాజుల ఆంజనేయులు మండల సంఘం గౌరవ అధ్యక్షులు రేకల లక్ష్మీనారాయణ. జిల్లా కమిటీ సభ్యులు పల్సము స్వామి. వలిగొండ పట్టణ సొసైటీ అధ్యక్షులు కొండూరు అంజయ్య వలిగొండ మాజీ ఉప సర్పంచ్ పబ్బు సురేందర్. మండల కమిటీ సభ్యులు బందరపు ధనంజయ. మద్దెల మారయ్య గాజుల వెంకన్న. మల్లేశం.పబ్బు స్వామి. భత్తు ల నరసింహ. భత్తుల వెంకటేశం. నారాగోని శంకర్.తండ వెంకటేష్. నారగోని పబ్బు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ యాత్ర

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే కబ్జాదారుల పై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తాం
- టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
- పటేల్ రమేష్ రెడ్డి



**సూర్యాపేటవిశాలభారతి:** టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి చేపట్టిన గడప గడపకు కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ కార్యక్రమం మంగళవారం రోజున 42వ వార్డు లో కొనసాగింది. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ చెరువు కట్ట ఆధునికీకరణ పేరు తో గత ఎనిమిది సంవత్సరాలుగా జగదీశ్వర్ రెడ్డి ప్రభుత్వ సొమ్మును దిగ మింగుతున్నాడని, 7,000 కోట్ల రూపాయల తో నియోజకవర్గంలో అభివృద్ధి చేసినాను అని అంటున్నారు. ఆ నిధులతో జగదీశ్వర్ రెడ్డి అభివృద్ధి చెందినడా, తన అనుచరులు అభివృద్ధి చెందినారా అని మేము ప్రశ్నిస్తున్నాము.గతంలో అవినీతి అధికారి గా పేరుగాంచిన మునిసిపల్ కమిషనర్ ను తిరిగి సూర్యాపేటకు తీసుకువచ్చి, ఆయన తో లావాదేవీలు చూసుకుంటున్నాడు.కమిషనర్ తో కుమ్మక్కయి 30% కమిషన్లు దండుకుంటున్నారు. గతంలో స్టడీ సెంటర్ కు కేటాయించిన 21 గుంటలు ప్రభుత్వ భూమిని అధికార పార్టీ రాబందులు కబ్జా చేసినట్లు వార్డు పర్యటన లో మా దృష్టికి వచ్చిందనీ అట్టి భూమినీ తక్షణమే స్వాధీనం చేసుకొని పార్కు కు కానీ, స్టడీ సెంటర్ కు కానీ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాము. పట్టణంలో, నియోజకవర్గం లో ప్రభుత్వ భూములను దొరికిన కాడికి అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారు. ఇక కొన్ని మాసాల లో ఏర్పడనున్న కాంగ్రెస్ ప్రభుత్వం లో కబ్జాదారులపై పిడి యాక్ట్ లు నమోదు చేసి, విచారణ జరిపి మెక్కినది అంతా కక్కిస్తామని హెచ్చరిస్తున్నాము అన్నారు.





## సీసీటీవీ కెమెరాలను ప్రారంభించిన ఆర్మూర్ ఏసిపి జగదీష్ చందర్

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండల కేంద్రంలోని తక్కుర్ వాడలో ఏర్పాటు చేసిన 10 సీసీటీవీ కెమెరాలను ఆర్మూర్ ఏసిపి జగదీష్ చందర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏసిపి జగదీష్ చందర్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టవచ్చని తెలిపారు.ఈ విధంగా ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం మోర్తాడ్ పోలీస్ స్టేషన్ ను ఆయన సందర్శించారు.స్టేషన్ లోని పరిసరాలను, రికార్డులను పరిశీలించారు.గ్రామాల్లో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు,ఎస్సై అనిల్ రెడ్డి,సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.



## మాపై కూడా కనికరం చూపించండి సారూ

- ఎమ్మెల్యేను కలిసి తమ బాధలు విన్నవించిన గ్రామపంచాయతీ కార్మికులు.

**షాద్ నగర్,విశాలభారతి:** గ్రామాలలో సచ్చిన మనుషులను, కుక్కలను, పశువులను కూడా తీసేస్తిమి, మోరీలను శుభ్రం చేస్తిమి. అన్ని పనులు కష్టం అనకుండా చేసినం. అందరి కష్టాలు తీరుస్తున్నారు.జర మాపై కూడా ప్రభుత్వం కనికరం చూపేలా చూడండి సారూ అంటూ పారిశుధ్య కార్మికులు తమ ఇబ్బందులను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిసి తమ సమస్యలను ఆయనకు వివరించారు. సంవత్సరాల తరబడి గ్రామపంచాయతీ కార్మికులకులుగా తాము పనిచేస్తున్నామని ఇస్తున్న పారితోషకం 9,500 కూడా ఇద్దరికీ ముగ్గురుకి ఇస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామపంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఇప్పటికే అంగన్వాడీ, ఆశవర్కర్ల జీతాలు పెంచామని త్వరలో రాష్ట్రప్రభుత్వం మీ సమస్యలు కూడా ఆలోచించి మంచి శుభవార్త చెప్తుందని ఆయన అన్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపచేయాలని, సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్మికులు ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ గ్రామపంచాయతీ కార్మిక నాయకులు జంగయ్య, యాదయ్య, మల్లేష్, నర్సింలు, భాగ్యమ్మ, కమలమ్మ, కృష్ణయ్య, నరసింహులు, పద్మమ్మ, కిష్టయ్య, చంద్రమ్మ, ప్రమీల, బుచ్చమ్మ, యాదమ్మ, పార్వతమ్మ, మైసమ్మ, మాణిక్యం, శ్యామల, సురేష్, పద్మమ్మ, దేవమ్మ, దేవజ నాయక్, మోహన్, రవి పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

**కోదాడ విద్యాధికారి సలీం షరీఫ్**

**కోదాడ,విశాలభారతి:** పుస్తక పఠనంతో విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని కోదాడ డివిజన్ విద్యాధికారి సలీం షరీఫ్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనం వలన గొప్ప మేధావులు, శాస్త్రవేత్తలు తయారవుతారని మంచి నడవడికతో అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలన్న పుస్తక పఠనంతోనే సాధ్యమవుతుందని అన్నారు. యువత సెల్ ఫోన్లను వీడి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి చేతిలో ఇంటిలో వివిధ రకాల పుస్తకాలు ఉండాలని వాటి పఠనం ద్వారా ప్రతిభవంతులై జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. నేటి నుండి 20 రోజులపాటు నిర్వహించే ఈ పుస్తక ప్రదర్శన మరియు అమ్మకములను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ అధ్యక్షులు వక్కవంతుల నాగార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి వల్లూరి రామిరెడ్డి, మాజీ అధ్యక్షులు మేకల వెంకటరావు, వైస్ ప్రెసిడెంట్ తీగల కరుణాకర్, జాయింట్ సెక్రటరీ యలమందల నరసయ్య, క్లబ్ సభ్యులు రాయపూడి చిన్ని, విద్యాసాగర్, తిరుమలగిరి రాధాకృష్ణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



## మంత్రి జగదీష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీసీ ఉద్యోగులు

- ఆర్టీసీని విలీనం చేయడంలో మంత్రిది కీలక భూమిక
- ముఖ్యమంత్రి కెసిఆర్ కు ఆర్టీసీ ఉద్యోగులు రుణపడి ఉంటారు
- తెలంగాణ మజ్దూర్ యూనియన్

**సూర్యాపేటవిశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయడంలో కీలక భూమిక పోషించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డికి సూర్యాపేట ఆర్టీసీ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మజ్దూర్ యూనియన్ హైదరాబాద్ జోన్ జాయింట్ సెక్రటరీ సుంకరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కు యావత్ ఆర్టీసీ ఉద్యోగులు రుణపడి ఉంటారని అన్నారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన మంత్రులు కేటీఆర్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి లకు ఆర్టీసీ లోకం అన్నివేళల్లో అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ సీనియర్ నాయకులు బెజవాడ సీతారాములు, బెల్లి నరసయ్య, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్ సి సైదులు, నాయకులు చెరుకు వెంకటయ్య, యూసఫ్, ఎండి జానీ, టి వీరయ్య, కె శ్రీధర్, రేణుక, సిబ్బంది సైదులు, జానయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ఎల్ ఈ డి బల్బులు మంజూరు చేసిన ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

**వలిగొండ,విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాగారం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి . మొగుళ్ళ.శ్రీనివాస్ చొరవతో స్థానిక భువనగిరి శాసనసభ్యులు పైల శేఖర్ రెడ్డి ని అడగగానే నాగారం గ్రామానికి 91 ఎల్ఈడి బల్బులు (36వాట్స్) సుమారు నాలుగు లక్షల రూపాయల విలువ గల బల్బులను ఎమ్మెల్యే. పైల్ల శేఖర్ రెడ్డి మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి కి సహకరించిన మాజీ జెడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్ కు నాగారం గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విశాల భారతి

vishalabharathi
Telugu Daily

బుధవారం, 09, ఆగస్టు 2023 | హైదరాబాద్




## శ్రీ చైతన్య పాఠశాలని సీజ్ చేయాలని సంతకాల సేకరణ

- **తల్లిదండ్రుల నుండి అపూర్వ స్పందన**
- **జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ మంత్రి స్పందించి డీఈవో ను సస్పెండ్ చేయాలి**
- **పిడి ఎస్ యు, ఎస్ ఎఫ్. ఐ, ఏఐఎస్ఎఫ్ఐ**

**సూర్యాపేటవిశాలభారతి:** పాఠ్యపుస్తకాల పేరుతో వేలాది డబ్బులు వసూలు చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాలని సీజ్ చేయాలని జిల్లా కేంద్రంలో పాఠశాల ముందు ఏర్పాటు చేసిన సంతకాల సేకరణకు అపూర్వ స్పందన వచ్చింది. అనంతరం ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి, పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేబోయిన కిరణ్ , ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ధనియాకుల శ్రీకాంత్ వర్మ లు మాట్లాడతూ గత 28 రోజుల క్రితం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ డే లో అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్న శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని అన్నారు. కలెక్టర్ ఎంక్వయిరీ చేసి పాఠశాలను సీజ్ చేయాలిని అన్నారు. కానీ డిఇఓ,ఏడి ఇద్దరు కలిసి కుమ్మక్కై సరైన విచారణ జరపకుండా తాత్సర్యం చేస్తూ, ముడుపులు తీసుకొని అక్రమాలకుపాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలను డీఈఓ ఎందుకు తుంగలో తొక్కుతున్నారని అన్నారు. పాఠశాలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీ చైతన్య పాఠశాలలో పుస్తకాలు అమ్మతూ ,షూస్, టై బెల్టుల, డ్రస్సుల పేరు మీద వేలాది రూపాయలను పిల్లల నుంచి గుంజుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులకు దరఖాస్తు చేసి దండం పెట్టినా కూడా పట్టించుకోవడంలేదని అని అన్నారు. తక్షణమే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠ్యపుస్తకాల పేరుతో వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక విద్యుత్ శాఖ మంత్రి స్పందించి డీఈవో పై చర్యలు తీసుకోనీ, శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేసి పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు డివిజన్ నాయకులు దూధిపాల ప్రవీణ్, సాయి ప్రదీప్ , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బానోత్ వినోద్, వినయ్ నాయకులు వంశీ, యశ్వంత్, మున్నా పాల్గొన్నారు.



## పేద విద్యార్థులకు దాతల సహాయం

**నూతనకల్,విశాలభారతి:** పేద పిల్లలకు విద్య దూరం కాకూడదని అందుకు దాతల సహకారం మరువలేనిదని ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు హన్మంతరావు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాస రాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుమారుడు సత్యనారాయణ రెడ్డి,కౌసల్య దేవి 60వేల రూపాయల విలువగల 50 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందించడం జరిగింది. పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పాఠశాలకు అవసరం అయిన చైర్స్ ను, అందించడం సంతోషించదగ్గ విషయమని అన్నారు ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు హనుమంతరావు అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు భూరెడ్డి కళావతి,జిల్లా పరిషత్ సభ్యులు కందాల దామోదర్ రెడ్డి, సర్పంచ్ తీగల కరుణశ్రీ, ఎం.పి.టి. సి. పన్నాల రమాదేవి, విద్యా కమిటీ చైర్మన్ పిట్టల కళమ్మ, మండల విద్యాధికారి రాములు నాయక్, ఐ. జే. యూ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, కృష్ణవేణి ఫౌండేషన్ చైర్మెన్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## 'రైతును లాభసాటిగా మార్చడమే ధ్యేయం'

**తుర్కయంజాల్, విశాలభారతి:** రైతులను లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ ఎఫ్ఎస్సీఎస్ పాలకవర్గ సమావేశం సత్తయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సంఘంలో నూతనంగా 21మంది సభ్యులను చేర్చుకున్నారు. అలాగే 18మంది రైతులకు కోటి 52లక్షల రూపాయల అప్పులు మంజూరు చేస్తూ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ రైతు సంక్షేమమే రైతుసేవా సహకార సంఘాల ధ్యేయమన్నారు. రైతుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. సంఘ సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం పాటుడపతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి, సంఘ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, సంఘ డైరెక్టర్లు చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కొండ్రు స్వప్న, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణ రెడ్డి, జిట్టా భార్గవి, సంఘ సెక్రటరీ వై.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్ల నిర్మాణం

**నూతనకల్,విశాలభారతి:** చిల్పకుంట్ల గ్రామంలో తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ ఆదేశాల మేరకు 15వ ఫైనాన్స్ జిల్లా పరిషత్ నిధులనుండి 5 లక్షల రూపాయల వ్యాయంతో ఎస్సీ కాలనీలో సిసి రోడ్లు నిర్మాణం చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో నూతనకల్ మండల జెడ్పిటిసి కందాల దామోదర్ రెడ్డి ,మండల నాయకులు బిక్కి బుచ్చయ్య గౌడ్ ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బత్తుల విజయకుమార్ ,మండల నాయకులు బాణాల సత్యనారాయణ రెడ్డి ,గ్రామ శాఖ అధ్యక్షుడు పులుసు లింగ మల్లయ్య ,కార్యదర్శి బత్తుల సురేష్,బత్తుల వెంకన్న ,పంతం కృష్ణయ్య,బత్తుల రామచంద్రు,బత్తుల గాంధీ, పన్నాలసైదిరెడ్డి. బొజ్జ వెంకటేష్ రాములు ఎల్లయ్య ఇరుగు శీను తదితరులు పాల్గొన్నారు.

# కౌలుకి కాగితం రాసుకుందామని చెప్పి అమ్మినట్టు రాసుకుండ్రు

- **ఇసుంట రమ్మంటే ఇల్లంతా నాదనేకాడికొచ్చే**
- **వత్తాసు పలుకుతున్న రెవిన్యూ అధికారులు**
- **న్యాయం చేయమని బీఎస్పీ అధ్వర్యంలో కలెక్టర్ కి పిర్యాదు**



**కేతేపల్లి,విశాలభారతి:** కౌలు కాగితం రాసుకుందామని చెప్పి అమ్మినట్టు రాసుకున్న వైనం కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే నల్లగొండ జిల్లా, కేతేపల్లి మండలం పరిధిలోని ఇనుపాముల గ్రామానికి చెందిన మేకల బిక్షమయ్య అనే వ్యక్తికి 70 సంవత్సరాల క్రితం సర్వే నెంబర్ 96, పట్టా నెంబర్ 559లోని రెండు ఎకరాల అసైన్డ్ భూమిని పంపిణీ చేయడం జరిగిందని, అప్పటి నుండి అట్టి భూమిని సేద్యం చేసుకుని,జీవనంసాగిస్తున్నట్టు, తర్వాత ఆర్థిక పరిస్థితుల సరిగ్గా లేకపోవడం వల్ల 8 సంవత్సరాల క్రితం తమ గ్రామస్తుడైన బత్తుల నర్సింహా రెడ్డి (రిటైర్డ్ టీచర్) కి కౌలు కి ఇవ్వడంతో నిరక్షరాస్యులైన నన్ను మోసం చేసి కౌలు కాగితం రాయాలని చెప్పి రూ100 బాండ్ పేపర్ పై రూ.40వెలకి కి విక్రయించినట్టు పేపర్ రాసి సంతకం చేయించడం జరిగిందని, ఇప్పుడు అట్టి భూమి నాది అని అప్పటి కాగితం తిసుకవచ్చి ఇబ్బందులకు పెడుతున్నారని, ఇంతకు ముందు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయగా అప్పటి కలెక్టర్ మండల తహశీల్దార్, అర్ఐ లను పంచనామా చేసి రిపోర్ట్ ఇవ్వాలని కోరారు. వారు మా బాధ వినకుండా అతను చెప్పిందే విని రిపోర్ట్ పంపించారని, మీము చెప్పండి రికార్డు చేయకుండా ఎలా రిపోర్ట్ ఇస్తారని ప్రశ్నించగా మరల అర్ఐ ను అక్కడి ప్రదేశంకి వెళ్లి మరల రిపోర్టు ఇవ్వమని కోరగా అక్కడ అర్ఐ దురుసుగా ప్రవర్తిస్తూ మా కుటుంబ సభ్యుల పట్ల అసభ్య పదజాలంతో ఏమీ చేసుకుంటారో చేసుకొమ్మని బెదిరిస్తున్నారని మాకు న్యాయం చేయమని బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గం ఇంచార్జి మేడి ప్రియదర్శిని నీ కోరగా బాధితులకు న్యాయం చేయాలని సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో ప్రియదర్శిని ఆధ్వర్యంలో పిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ త్వరలో కొత్త పాస్ పుస్తకం మంజూరు చేయిస్తాన ని కోర్టులో సమస్య పరిష్కారం అవుతుందని సూచించారు.ఈ కార్యక్రమంలో కేతపల్లి మండల అధ్యక్షులు ఎడ్ల విజయ్, మేకల నర్సింహా, మేకల బిక్షం,మేకల భారతమ్మ, మేకల రవి, వంటేపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




## బిజెపి నేత జ్ఞానేంద్ర ప్రసాద్ ప్రదమ వర్ధంతి

**నివాళులర్పించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** దివంగత నేత ముల్ల గురు జ్ఞానేంద్ర ప్రసాద్ ప్రధమ వర్ధంతిని మియాపూర్ లోని ఆల్విన్ కాలనీలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, హాజరయ్యారు.జ్ఞానేంద్ర ప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేగురాలని కోరుతూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తూ సేవా భారతి విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ గడ్డుకాలంలో భారతీయ జనతా పార్టీని భుజస్కంధాలపై వేసుకొని నిరంతరం పార్టీ కోసం శ్రమిస్తూ అంచలంచెలుగా ఎదుగుతూ మంచి గుర్తింపు వచ్చే సమయంలో కాలం కాటు వేసి కానరాని లోకానికి జ్ఞానేంద్ర ప్రసాద్ వెళ్లిపోయారన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతరెడ్డి, ఎల్లేష్,రాధాకృష్ణ యాదవ్, హఫీజ్ పేట్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు మాణిక్ రావు ,రవి గౌడ్, ఆకుల లక్ష్మణ్ ,పృధ్వి గౌడ్, గణేష్ ముదిరాజ్ ,అశోక్, శ్రీనివాస్ యాదవ్, రామకృష్ణారెడ్డి, విద్యా కల్పన గౌడ్, జగన్ గౌడ్ మొదలగు వారు పాల్గొన్నారు





## జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో యాదవ గర్జన

- **యాదవులను ఓట్ల కోసమే వాడుకుంటున్నారు**
- **యాదవులను ఆర్థికంగా, రాజకీయంగా,ఎదగనివ్వాలి**
- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్**



**శేరిలింగంపల్లి,విశాలభారతి:** యాదవులను ఓటు బ్యాంకుగా చూడకుండా రాజకీయంగా, ఆర్థికంగా ఎదగనివ్వాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు.జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన యాదవ గర్జన కార్యక్రమంలో యాదవ సంఘం జాతీయ నాయకులు,రాష్ట్ర నాయకులు,యువజన నాయకులతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ హక్కుల కోసం పోరాడుతున్న యాదవ సమితిని అభినందించారు. అలాగే మన యాదవుల సంక్షేమం కోసమే మనం అందరం కృషి చేయాలని పిలుపనిచ్చారు.50 ఏళ్ల గొర్ల కాపరులకు రూ.3 వేలు ఫించన్,ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్ల కాపరులకు రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా, గొర్లు,మేకలకి ప్రమాద బీమా ప్రభుత్వం చేయించాలని,గొర్లు మేకల సబ్సిడీ లోన్స్ లో ప్రాముఖ్యత గొల్ల కురుమలకు ఇవ్వాలన్నారు.జిల్లాలలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లో గొల్ల కురుమలకు ప్రాథమిక ప్రాధాన్యత కల్పించడం, యాదవ కార్పొరేషన్ ఏర్పాటు , తెలంగాణలో మనం 18 శాతం ఉన్నామని రాజకీయాలలో ఎమ్మెల్యే,ఎంపి నామినేటెడ్ పదవులలో రిజర్వేషన్స్ , ఎస్ఎస్టి రిజర్వేషన్ పునరుద్ధరణ లాంటి డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యాదవులను ఓట్ల కోసం వాడుకుంటున్నారని,గోర్లు, బర్లు,ఇవ్వడం మాత్రమే కాదు, విద్యాపరంగా ఎదిగేలా చూడాలని కోరారు. యాదవులను ఆర్థికంగా, రాజకీయంగా అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జాతీయ యాదవ సంఘం అధ్యక్షులు మేకల రాములు, రాష్ట్ర యాదవ యువజన సంఘం అధ్యక్షులు వంశీకృష్ణ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్షులు రవి, సాయన్న యాదవ్ ,శ్రీహరి యాదవ్, రాధాకృష్ణ యాదవ్, బాలు యాదవ్, కుమార్ యాదవ్, పవన్ యాదవ్, శ్రీశైలం యాదవ్,శ్రీనివాస్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన డీఈవో

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే, కలెక్టర్ కు పాఠశాల లో ఉపాధ్యాయుల కొరత, వసతుల గురించి వినతి పత్రాలు సమర్పించిన విషయం పై వాస్తవ పరిస్థితులని పరిశీలించుటకు పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయు లతో సమావేశం ఏర్పాటు చేసి వారికి బోధనకు సంబంధించిన తగు సూచనలు చేశారు. 10వ తరగతి విద్యార్థిని విద్యార్థుల తో మాట్లాడుతూ బాగా కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ బాలకృష్ణ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభ

**పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** ప్రజా యుద్ధ నౌక,గాయకుడు, విప్లవ వీరుడు గద్దర్(గుమ్మడి విట్టల్ రావు) సంస్మరణ సభను మంగళవారం మియాపూర్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.గద్దర్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల గొంతుకై తెలంగాణ ఉద్యమంలో తనదైన కీలక భూమిక పోషించిన గద్దర్ ఆకస్మిక మృతికి విచారం వ్యక్తం చేశారు.తన జీవితకాలం పీడిత వర్గాల చైతన్యానికి కాలికి గజ కట్టి ఆట పాటలతో తెలంగాణ వ్యాప్తమే కాకుండా తెలుగు రాష్ట్రాలలోని మారుమూల గ్రామాలలోకి వెళ్లి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి, లక్షల మందిని అభిమానులుగా మలుచుకున్న ఘనత గద్దర్ కే దక్కుతుందన్నారు.బండెనక బండి కట్టి పాట మొదలు ఉవ్వెత్తున తెలంగాణ ఉద్యమం ఎగసిపడుతున్న సమయంలో జై బోలో తెలంగాణలోని పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా.. పాట వరకు ఎన్నో సాహిత్యాలను రచించి స్వయంగా పాడి తెలుగు ప్రజలను చైతన్యం వైపు అడుగులు పడేలా చేసిన కృషిని మర్చిపోలేరన్నారు. విప్లవ భావాలతో తూటాలకు ఎదురొడ్డి మరణించే వరకు తన ఆట,పాటలతో పేద ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. జీవితమంతా ఉద్యమాలలో విప్లవాలతో పేద ప్రజల కష్టాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు.వారికి సమచిత గౌరవాన్ని ఇస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు అధికారుల లాంఛనాలతో ఆయన అంతిమ సంస్కారాలను నిర్వహించడం నిజంగా అభినందనీయమన్నారు .ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున శర్మ, గంగారం సంగారెడ్డి,నిమ్మల శేఖర్ గౌడ్, శంకర్ నాయక్,తెప్ప బాలరాజ్, సలీం,సిల్వర్ మనీష్,కృష్ణ గౌడ్, సాయన్న,అంజాద్,మురళి, కాకర్ల అరుణ,పూజా,పద్మ, మోహిని,సత్యరెడ్డి,శంకర్రావు, రమణ,గౌస్,తదితరులు పాల్గొన్నారు.



## మాదాపూర్ డివిజన్ అభివృదికి పక్క ప్రణాళికతో ముందుకు సాగుతాం

**కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్క ప్రణాళికతో గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని,శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోనే మాదాపూర్ డివిజన్ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని,ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం చూపుతామని,డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేల అహర్నిశలు కృషి చేస్తామని మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర గౌడ్ తెలిపారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో పర్యటించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కాలనీ సభ్యులతో సమీక్షించారు. నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళలా ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోకుల్ ప్లాట్స్ బిఆర్ఎస్ బస్తి అధ్యక్షులు బి.శ్రీనివాస్,వార్డ్ సభ్యులు శ్రీనివాస్, నాయకులు నాగేశ్వరరావు,ప్రభాకర్,సాంబయ్య, ప్రసాద్,సత్యం,ప్రకాష్ రెడ్డి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కెజిబివి, యుఆర్ఎస్ నాన్ టీచింగ్ వర్కర్స్ కి కనీస వేతనాలేవి

**తెలంగాణ రాష్ట్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు 475 ఉన్నవి, జిల్లాకోక అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (URS) లు ఉన్నవి. వీటిలో 95 పాఠశాలల్లో ఇంటర్ వరకు అప్ గ్రేడ్ చేశారు.దీనిలో అకౌంటెంట్,ANM, కుక్స్, అటెండర్, హెల్పర్స్, స్వీపర్స్, స్కావెంజర్,డే,నైట్ వాచ్ ఉమెన్స్,క్రాఫ్ట్, కంప్యూటర్ ఆపరేటర్ లు మొత్తం రాష్ట్ర వ్యాపితంగా 7 వేల మంది పైగా పని చేస్తున్నారు. ప్రభుత్వం నాన్ టీచింగ్ వర్కర్స్ ను పట్టించుకోవడం లేదు.**

KGBV నాన్ టీచింగ్ వర్కర్స్ కు ఎలాంటి ఉద్యోగ భద్రత లేదు.అరా కోర వేతనాలతో 12 గంటలు కు పైగా పని చేస్తారు.ఎంతో శ్రమ చేస్తున్న వీరికి తగిన గుర్తింపు లేదు. పెరుగుతున్న ధరలను పోల్చుకున్నప్పుడు నేడు వీరికి నెలకు చెల్లిస్తున్న రూ" 9750/_ వేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీనితో ఆర్థిక భారం పడి తీవ్ర మానసిక, పని ఒత్తిడికి గురవుతున్నారు.KGBV లలో కనీస వేతనాల చట్టం ను వర్తింప చేయడం లేదు. రాష్ట్ర కనీస వేతన సలహా మండలి కూడా కనీసం బేసిక్ రూ" 18000 ఉండాలని తీర్మానం చేసి, ఏడు సంవత్సరాలు పూర్తవుతుంది. అయినా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడం లేదు నిర్లక్ష్యం వహిస్తుంది. బిస్వాల్ కమిషన్ రూపొందించిన పిఆర్సి నివేదిక ప్రకారం 19 వేలు ఇవ్వాలి అయినా ఆ వేతనాలు కూడా ఇవ్వడం లేదు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కేజీబీవీ లలో చెల్లిస్తున్న వేతనాల ప్రకారమైన ఈ రాష్ట్రంలో ఇవ్వడం లేదు. కావున పెరిగిన ధరల కనుగునంగా రూ" 26000 వేతనం నిర్ణయించాలి. క్రాఫ్ట్, కంప్యూటర్ ఆపరేటర్ లను పార్ట్ టైం వర్కర్స్ గా చెప్పి ఫుల్ టైం వర్క్ చేయించుకుంటున్నారు. వేతనాలు రూ" 7800/_ మాత్రమే చెల్లిస్తున్నారు. వీరిని ఫుల్ టైం వర్కర్ లుగా గుర్తించి వేతనాలు పెంచాలి.అకౌంటెంట్ లు నిరంతరం DEO, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ పరుగులు పెట్టాల్సిన పరిస్థితి.వీరికి TA,DA లు లేవు.ANM లకు వారంలో మూడు నైట్ డ్యూటీలు ఉన్నవి. నెలకు 13 రోజుల నైట్ డ్యూటీలు చేయాలి.పిల్లలకు ఎమర్జెన్సీ ఉంటే డ్యూటీ లేకున్నా తప్పక వెళ్ళాల్సిందే.దీనితో వారి కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు.రెండోవ ANM ను, కేర్ టేకర్ ను నియమించాలి.వంట వర్కర్స్, స్వీపర్స్ , స్కావెంజర్స్ కు పొగ,దుర్వాసన,దుమ్ము ధూళి తో శ్వాస క్వోశా వ్యాధులకు గురవుతున్నారు.వీరికి మాస్క్ లు,బ్లౌజ్ లు,చేతులు శుభ్రం చేసుకునే రక్షణ పరికరాలు ఇవ్వాలి.

రాష్ట్రంలో వివిధ కారణాలతో అన్యాయంగా నాన్ టీచింగ్ వర్కర్స్ ను విధులు నుండి తొలగిస్తున్నారు.ముందస్తు మెమో లేదా నోటీస్ లు లేకుండా అదిలాబాద్ జిల్లాలో నేరడిగొండ మండలం ,జనగాం జిల్లా దేవరుప్పుల KGBV లలో టెర్మినేట్ చేశారు.చిన్న ఉద్యోగస్తుల పై ప్రతాపం చూపిస్తున్నారు. ఎలాంటి చట్ట బద్ద హక్కులు లేనటువంటి వీరిపై చర్యలు ఏమిటి ?కనీసం ఏదైనా ఘటన జరిగినప్పుడు వర్కర్స్ తో కలిసి విచారణ చేపట్టాకుండా విధులు నుండి తొలగించడం దేనికి సంకేతం? డ్యూటీ లో లేనటువంటి వారి పై కూడా చర్యలు చేపడుతున్నారు.అధికారులు కనీసం ఆలోచన లేకుండా వ్యవహరిస్తున్నారు.ఇప్పటికైనా ఆయా జిల్లాల్లో టెర్మినేట్ చేసిన వర్కర్స్ ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

హాస్టల్ లో వంట గదులలో గ్యాస్ లపై వంటలు చేస్తున్నారు.గదులను నిరంతరం శుభ్రం చేసుకుంటున్నారు. హాస్టల్ లో వంటల వండుతున్నపుడు బల్లులు పడి విద్యార్థులు అశ్వస్తకు గురయ్యే వార్తలు అక్కడక్కడ చూస్తున్నాం.దీనితో గోడ మీద ఉన్న బల్లుల తో కూడా వర్కర్స్ యుద్ధమే చేస్తారు.గ్యాస్ తో మంటలు పెరిగి హాస్టల్ లో వర్కర్స్ చేతులు, చీరలు కాలిన ఘటనలు కోకొల్లలు. అందుకే ప్రతి హాస్టల్ కు ఫైర్ సేఫ్టీ నీ ఏర్పాటు చేయాలి.

రాష్ట్రం విడిపోయే నాటికి మిగులు బడ్జెట్ లో ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్కువ వేతనాలు రూ"9750/_ ఇస్తుంది.మన పక్క రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ లో KGBV లలో గుడ్డిలో మెల్లగా నైన రూ" 14000/_ పైగా మెరుగైన వేతనాలు చెల్లిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో చెల్లిస్తున్నట్లు తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదు.తెలంగాణ ప్రభత్వం కూడా ఆలోచన చేయాలి.ఆగస్టు 3 నుండి జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో విద్య శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలో వర్కర్స్ కు తక్కువ వేతనాలు ఉన్నవని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టి కి తీశకవెళ్తమని సభ ముఖంగా చెప్పారు. మధ్యంతర పి ఆర్ సి కూడా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.దీనిలో కె జి బి వి, యన్ ఆర్ ఎస్ ,మోడల్ స్కూల్ హాస్టల్ వర్కర్స్ ను చేర్చాలి.వారికి తెలంగాణలో కనీస వేతనాలను అమలు చేయాలి.

రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగానే కేజీబీవీ లో కొనసాగుతున్న నాన్ టీచింగ్ వర్కర్స్ ను కూడా రెగ్యులరైజేషన్ చేయాలి.గత అసెంబ్లీ సమావేశంలో 11 వేల మందిని పర్మినెంట్ చేస్తామని ప్రభత్వం ప్రకటించింది.అందులో KGBV వర్కర్స్ జాడే లేదు. ఎప్పటికైనా ప్రభుత్వాలు పర్మినెంట్ చేస్తాయని,వేతనాలు పెంచుతారని ఎదురు చూస్తుంటే ఉలుకు పలుకు లేదు. అప్ గ్రేడ్ చేసిన KGBV లలో సరిపడ సిబ్బందిని నియమించ లేదు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయ లేదు.ఖాళీల భర్తీ అక్కడక్కడ ఏజెన్సీల ద్వారా చేస్తున్నారు. దీనితో అక్రమాలు చోటు చేసుకున్నాయి.దీనిపై విచారణ జరిపి శాశ్వత ప్రాతిపాదికన పోస్టులను భర్తీ చేయాలి.

కేజీబీవీ, యూ ఆర్ ఎస్ లలోని వర్కర్స్ జీవితాలకు ఉద్యోగాలకు భద్రత లేదు.60 ఏళ్లు దాటిన తర్వాత వారి పరిస్థితి అంధకారంగా మారింది. అకస్మాత్తుగా ప్రమాదాలు జరిగితే వారికి ఎలాంటి బెనిఫిట్స్ లేవు.ఈ విధంగా 18 సంవత్సరాలు పైగా పని చేసి చనిపోయిన వారి కుటుంబాలకు భద్రత,బరోసా కల్పించాలి.ప్రమాదాలు జరిగి అంగవైకల్యం జరిగితే ఆర్థికంగా చితికి పోతున్నారు.వీరికి ESI సౌకర్యం కల్పించాలి.మృతి చెందిన ప్రతి వర్కర్ ను గుర్తించి వారి కుటుంబాలకు 20 లక్షలు ఎక్స్ గ్రేసియా చెల్లించాలి.

రాష్ట్ర ప్రభుత్వం మహిళ ల కు రక్షణ,భద్రత, సంక్షేమ పథకాలు కల్పిస్తాం అని చెప్పి కాలం వెళ్లదీస్తున్నారు.ఓట్లకు ముందు మహిళా హక్కుల గురించి ఊక దంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం,మంత్రులు,MLA లు KGBV,URS నాన్ టీచింగ్ వర్కర్స్(మహిళా కార్మికులు) సమస్యలను ఎందుకు పరిష్కారం చేయడం లేదు. వీళ్ళు తెలంగాణ రాష్ట్రంలో బాగం కాదా ?బాలికలకు సేవలు చేస్తున్న వీరిపై ఎందుకు వివక్షత.ఓట్లు,సీట్లు ప్రధానంగా చూస్తే మహిళా కార్మికుల జీవన పరిస్థితి ఎలా మారాలి. అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 3 నుండి జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లో KGBV,URS నాన్ టీచింగ్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను కూడా చర్చించి పరిష్కారం చూపాలి. KGBV,URS లలో కనీస వేతనాలు అమలు చేయుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టి పెట్టాలి. మహిళా కార్మికుల ఉద్యోగాలకు, జీవితాలకు భద్రత కల్పించాలి.



గంట నాగయ్య
KGBV నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్
రాష్ట్ర అధ్యక్షులు
9493484188



## పెన్షన్ పెంపు పత్రాల పంపిణీ కార్యక్రమం

**నారాయణఖేడ్,విశాలభారతి:** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఖేడ్ మున్సిపాలిటీలో 2,900 మంది పెన్షనియర్లకు లలో 290 మంది దివ్యంగులకు రాష్ట్ర ప్రభుత్వం 3000 నుండి 4000 వేలకు పెంచిన పెన్షన్ పత్రాలను దివ్యంగులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ రూబీనా నజీబ్,వైస్ చైర్మన్ పరశురాం,కౌన్సిలర్లు మాజిద్, సంధ్యారాణి రామకృష్ణ .అభిషేక్ శేట్కర్ పాల్గొన్నారు.



## మూడోసారి బిఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం

- **అభివృద్ధిని చూసి పార్టీలోకి వలసలు**
- **నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

**రామన్నపేట,విశాలభారతి:** మూడోసారి బిఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం అని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నార్కట్ పల్లి లోని క్యాంపు కార్యాలయంలో రామన్న పేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 80 మంది ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....తెలంగాణలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రిదని అన్నారు. దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. నియోజకవర్గంలో ప్రజా సంక్షేమ పథకాలన్నే పకడ్బందీగా అమలవుతున్నాయంటూ కితాబిచ్చారు. పార్టీలో చేరిన వారిలో లక్ష్మి నరసింహ మాజీ సర్పంచ్, కడారి సత్తయ్య మాజీ వార్డు మెంబెర్, కడారి చంద్రయ్య, ఆరేళ్ళ లింగమ్మ, కళమ్మ, బుషపాక రేణుక, మల్లయ్య, సామ రవీందర్ రెడ్డి, దేశాపాక ఇస్తారి, ముస్కు యాది రెడ్డి, బండమీది నాగరాజు, దండుగుల శ్రీను, జాల రమేష్, కక్కిరేణి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



## విదేశీ చదువులకై సర్కారు సాయం

**చెక్కును అందజేసిన ఎమ్మెల్యే**

**భువనగిరి,విశాలభారతి:** విదేశాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కీం ద్వారా వలిగొండ మండలం వర్కట్ పల్లి గ్రామానికి చెందిన గంధమల్ల వినోద్ కుమార్ మంజూరైన 10 లక్షల 10వేల రూపాయల చెక్కును విద్యార్థి తండ్రి బాలయ్యకు భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి అందజేశారు.



## గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ముఖ్యమంత్రి చిన్న చూపు

- **బెల్లంకొండ సత్యనారాయణ**
- **ప్రజా సంఘాల ఐక్యవేదిక మండల కన్వీనర్**

**నడిగూడెం,విశాలభారతి:** గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లను తీర్చకుండా కార్మికుల పట్ల చిన్న చూపు చూడడం తగదని మండల ప్రజా సంఘాల కన్వీనర్ బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు ఉన్న అంబేద్కర్, జగ్జీవన్ రామ్ ల విగ్రహం హాల ముందు గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 34వ రోజు సమ్మెలో ఒంటి కాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్, ఎన్ని అడ్డంకులు సృష్టించిన పోలీసులతో అరెస్టలు చేయించిన వీరోచితంగా సమ్మె కొనసాగిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది న్యాయమైన డిమాండ్స్ తీర్చాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన 51 జిఓ రద్దు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్ ప్రత్యేక స్టేటస్ కల్పించి పంచాయతీ కార్యదర్శులకు సహాయ కార్యదర్శిగా నియమించాలని 11వ పిఆర్సి ప్రకారం జీతాలు చెల్లించాలని,60వ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మల్లెల ఎంకన్న, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు చిమట నాగరాజు,మండల గ్రామ పంచాయతీ ప్రధాన కార్యదర్శి వెంకన్న, కళ్యాణి,సక్కుబాయి, లచ్చయ్య , వీరస్వామి,నాగభూషణం, గురవయ్య ఎంకన్న ,తిరపయ్య, సుభాని,కమలాకర్, భిక్షం,రాములు నాగయ్య ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్యసాధనలో గెలిచిన విజేతలకు అభినందనలు

**తల్లిదండ్రులను సత్కరించిన శశిధర్ రెడ్డి**

**నడిగూడెం,విశాలభారతి:** లక్ష్యసాధనలో అనుకున్న లక్ష్యాలను చేరుకొని విజేతలైన కొండ వంశీకృష్ణ, బోళ్ల సందీప్ రెడ్డి లను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని భారత రాష్ట్ర సమితి కోదాడ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ కన్మంత రెడ్డి శశిధర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలం లోని నడిగూడెం గ్రామానికి చెందిన బోళ్ల సీతారాం రెడ్డి విజయలక్ష్మి ల కుమారుడు సందీప్ రెడ్డి, బృందావనపురం గ్రామానికి చెందిన కొండ ఉపేందర్ నాగమణిల కుమారుడు కొండా వంశీకృష్ణ లు ఎస్సైలుగా ఉద్యోగం పొందిన సందర్భంగా వారి ఇరువురి నివాసాలకు వెళ్లి వారి తల్లి దండ్రులను శాలువాలతో ఘనంగా సత్కరించి, నూతనంగా ఉద్యోగాలు పొందిన వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు కుటుంబాల్లో పుట్టిన యువతకు కష్టపడటం కొత్త ఏమీ కాదని, అత్యంత సునాయాసంగా లక్ష్యాన్ని సాధించే సత్తా రైతు బిడ్డలకు పుట్టుకతో వస్తుందని అన్నారు. కేవలం ప్రణాళిక బద్ధంగా లక్ష్యసాధనని ఛేదించాలని అప్పుడే సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం జడ్పిటిసి బాణాల కవిత నాగరాజు, చిలుకూరు మండల జడ్పిటిసి బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, అనంతగిరి జడ్పిటిసి కొనతం ఉమా శ్రీనివాస్ రెడ్డి , మునగాల మండల వైస్ ఎంపీపీ బుచ్చి పాపయ్య, తాడ్వాయి మాజీ సర్పంచ్ లక్కా నాయక్, వల్లూరి శ్రీనివాస్ పత్తిపాక లక్ష్మీనారాయణ, లింగయ్య, వంశీ ,ఆలీ బాబు, పాపయ్య, కోట వెంకటేశ్వర్లు, గుండు విజయ రామారావు, శశిధర్ రెడ్డి యువసేన నాయకులు రవి, ప్రవీణ్ తుపాకుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్యం... ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలి..

**మోటివేషనల్ స్పీకర్ గణేష్ కుప్పాల.**

**తొర్రూరువిశాల భారతి:** విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే విజయం తథ్యమని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కుప్పాల గణేష్ పేర్కొన్నారు. వెలికట్ట వాసి, ఎన్నారై ఆబోతు మధు విజ్ఞప్తి మేరకు లండన్ కు చెందిన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గణేష్ మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నితిన్ ఫౌండేషన్, మండలంలోని గుర్తూరు మోడల్ స్కూల్ లను సందర్శించి వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సందర్భంగా గణేష్ మాట్లాడుతూ....

జీవితంలో విద్యార్థి దశ కీలకమని, ప్రతి ఒక్కరికి ఒక లక్ష్యం ఉండాలన్నారు. ఆ లక్ష్యసాధనకు సంకల్పబలంతో అడుగులు వేయాలని, అందులో భాగంగా ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. లక్ష్యం, ఆత్మవిశ్వాసం రెండు ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదని అభిప్రాయపడ్డారు. ప్రాథమికంగా ఐదు విషయాలను విద్యార్థులు ఎప్పుడూ గుర్తుంచుకుంటే విజయాలు దరిచేరతాయన్నారు. అందులో ఒకటి ఆడంబరమైన జీవితం లేకున్నా పర్వాలేదని, కానీ లక్ష్యం అనేది తప్పకుండా ఉండాలన్నారు. మనల్ని ఒకరు కించపరిచినా, అమర్యాదగా ప్రవర్తించినా ఉపేక్షించకుండా ప్రతిఘటించాలన్నారు. అందుకు ఆత్మవిశ్వాసం అవసరమని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతి పరిజ్ఞానంలో సెల్ఫోన్స్ ఎంతవరకు వినియోగించుకోవాలో అంతవరకు మాత్రమే వినియోగించుకోవాలని, అందుకు స్వీయనియంత్రణ అవసరమన్నారు. ఆ తరువాత ప్రణాళిక, నిబద్ధత ఈ ఐదు అంశాలను ఎప్పుడూ దృష్టిలో ఉంచుకుని అనుసరిస్తే మంచి విద్యార్థులుగా రాణించి, సమాజహితం కోరే మేటి పౌరులుగా ప్రతి ఒక్క విద్యార్థి ఎదగుతారని ఆక్షాంకించారు. ఎక్కడున్నా, ఎలాఉన్నా అందరికన్నా మనల్ని అమితంగా ప్రేమించేది మన తల్లిదండ్రులన్న విషయాన్ని మరువకూడదని, వారికి ఇచ్చే స్థానం ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని సూచించారు. వీటన్నింటితో పరిపూర్ణమైన వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుందన్నారు.

ఇద్దరు పేద విద్యార్థులను దత్తత తీసుకొని వారికి ఉద్యోగం వచ్చేవరకు పూర్తి ఖర్చులు భరిస్తానని గణేష్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వందే మాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తక్కెళ్ళపల్లి రవీంద్ర, తొర్రూరు హెచ్ఎం బి వి రావు, గుర్తూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## భీమ్గల్ మున్సిపల్ కి 10కోట్లు మంజూరు

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్గల్ మున్సిపాలిటీకి 10 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కేసిఆర్, పురపాలక శాఖ మంత్రి కేటిఆర్,మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి,ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేసి టపాకాయలు కలిసి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత సురేందర్ మాట్లాడుతూ భీమ్గల్ మున్సిపాలిటీ అభివృద్ధి పరంపర కొనసాగుతుందని చెప్పారు. ఇప్పటికే కోట్ల రూపాయల నిధులతో పట్టణాన్ని సకల సౌకర్యాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నుండి మరో 10 కోట్లు మంజూరు చేయించారని అన్నారు. భీమ్గల్ పట్టణ సర్వతోముఖాబివృద్దే తన ధ్యేయమని మంత్రి పలు మార్లు పునరుద్ఘాటించారని తెలిపారు.భీమ్గల్ మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేసిన మున్సిపల్ శాఖ మంత్రి కేటిఆర్,సహకరించిన ఎమ్మెల్సీ కవిత,మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బోదిరే నర్సయ్య, సతీష్గౌడ్ నాయకులు మల్లెల ప్రసాద్,ముత్తెన్న, దశ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నైపుణ్యమైన విద్యను అందించాలి

**ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు ఉపేందర్**

**పాలకుర్తి, విశాలభారతి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల నోడల్ అధికారి నారబోయిన యాకయ్య అధ్యక్షతన జరుగుతున్న రెండు రోజుల ఉపాధ్యాయుల (ఇంగ్లిష్) శిక్షణ కార్యక్రమాన్ని SCERT రాష్ట్ర పరిశీలకులు ఉపేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో అనుభవం, శిక్షణ కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని కోరారు. ప్రతి ఉపాధ్యాయుడు.. విద్యార్థుల స్థాయికి తగ్గట్టుగా విద్య బోధన చేసినప్పుడే విద్యార్థికి మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు వర్క్ బుక్ ద్వారా కూడా బోధించుట వలన ఎక్కువ జ్ఞాపకం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, జిల్లా పరిశీలకులు రఘు జీ, ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఇంచార్జ్ పోతుగంటి నర్సయ్య, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, ఎంఆర్సి సిబ్బంది రమేశ్, కిషన్, సరేష్, అరుణ పాల్గొన్నారు.



# 10న పోదాం పదండి మెదక్‌కు..

- 'డబుల్' ఇండ్ల కోసం బీజేపి మహా ధర్నా
- హాజరుకానున్న ఈటల రాజేందర్

**పటాన్ చెరు, విశాలభారతి :** మెదక్ పట్టణ కేంద్రంలో ఈ నెల 10వ తేదీన "డబుల్ బెడ్ రూమ్" ఇండ్ల కేటాయింపు కోసం బిజెపి అధ్వర్యంలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్టు బీజేపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడిల శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మాజీ మంత్రి, హుజురాబాద్ శాసనసభ్యులు ఈటల రాజేందర్ హాజరవుతున్న ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ 9 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, నిర్మాణం చేపట్టిన "డబుల్ బెడ్ రూమ్" ఇండ్లను ఏ ఒక్క పేదవారికి కేటాయించలేదని అన్నారు . రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించే వరకు భారతీయ జనతా పార్టీ తరపున పోరాడుతామని తెలిపారు. ప్రచారాలకు పరిమితమయ్యారే తప్ప నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఏ ఒక్కరికి కేటాయించలేదని, కొన్నిచోట్ల నిర్మాణ దశలో ఉండగానే శిథిలావస్థకు చేరుకున్న దుస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ సమావేశంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, భారతి నగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్, పటాన్ చేరు పట్టణ అధ్యక్షుడు నాగరాజు, పటాన్ చెరు మండల ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్ రాజ్, పటాన్ చెరు పట్టణ ప్రధాన కార్యదర్శి ఆదిత్య, యస్.ఆర్.కే యువసేన సభ్యులు శకిల్, బన్నీ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించండి

- బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** తల్లిదండ్రులు లేకుండా సంరక్షకుల వద్ద పెరుగుతున్న పిల్లలను గుర్తించాలని మునిసిపల్ కమిషనర్ సంగారెడ్డి ఆదేశించారు. మంగళవారం నాడు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 0 నుండి 25 సంవత్సరముల లోపు తల్లిదండ్రులు లేకుండా సంరక్షకులు వద్ద జీవిస్తున్న పిల్లలను గుర్తించాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించాలని సూచించారు. వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, రిసోర్స్ పర్సన్స్, అంగన్వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలకు విధి విధానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



# పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణ లక్ష్మి పథకం

**భారతీనగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**పటాన్ చెరు, విశాలభారతి:** కళ్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరం అని భారతి నగర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. డివిజన్ వార్డు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి చెక్కులను కార్పొరేటర్ సింధు పంపిణీ చేశారు. 22 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రపంచంలోనే ఎక్కడ కళ్యాణ లక్ష్మి ఇలాంటి పథకం లేదని చెప్పారు. ఆడపిల్లల వివాహాలు భారం కావద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ బృహత్తర పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు.

**ఈవీఎం, వివి ప్యాట్ వినియోగంపై అవగాహన..**

ఈవీఎం వివి ప్యాట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ ఈవిఎం మెషీన్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవీఎం, వివి ప్యాట్ ద్వారా ఓటు వేయడం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, కుమార్ గౌడ్, మోహన్ రెడ్డి, మహిళ సంఘాల నాయకురాలు, బిఅర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# బీఆర్ఎస్సోల్లేనా బంధులు..?

- దళితులందరికీ 'దళిత బంధు' ఇవ్వాలి
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ 'కాట'
- బొల్లారంలో కాంగ్రెస్ పార్టీ నిరసన

**పటాన్ చెరు, విశాలభారతి:**
బీఆర్ఎస్ పార్టీ వాళ్లు మాత్రమే బంధువులుగా వ్యవహరిస్తూ, వారికి మాత్రమే దళిత బంధు పథకం అందిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం బొల్లారం మున్సిపాలిటీలో మున్సిపాలిటీ ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొని కాట శ్రీనివాస్ గౌడ్ కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరికి కాకుండా అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొల్లారం మున్సిపాలిటీలో ఉన్న 519 కుటుంబాలలో వారికి అనుకూలమైన కేవలం 75 దళిత కుటుంబాలకు మాత్రమే దళిత బంధు ఇచ్చారని విమర్శించారు. కేసీఆర్ దళిత ద్రోహి అని, దళితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, ఎంపిపి రవీందర్ గౌడ్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రెసిడెంట్లు వడ్డె కృష్ణ, నర్సింగ్ రావు, సుధాకర్ గౌడ్, అశోక్ ముదిరాజ్, మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ క్రిష్ణ రెడ్డి, జనరల్ సెక్రటరీ లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు వీరారెడ్డి, శ్యామ్ రావు, ఎంపీటీసీలు నాగేందర్ గౌడ్, దేవదానం, గోవర్ధన్ గౌడ్, నరేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, బొల్లారం మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ క్రిష్ణ రెడ్డి, జనరల్ సెక్రటరీ లక్ష్మారెడ్డి, మహేష్ రెడ్డి, కౌన్సిలర్ సంతోష లక్ష్మారెడ్డి, ట్రెజరర్ ఇమ్రాన్, సంగారెడ్డి జిల్లా మైనారిటీ ఛైర్మెన్ హబీబ్ జానీ, జయశంకర్ గౌడ్, రాధాక్రిష్ణ, టౌన్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నరేష్ యాదవ్, ప్రవీణ్, బన్నీ, కీర్తన్ రెడ్డి, హరీష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.







# అలీ అబ్బాస్ జాతర పోస్టర్ ఆవిష్కరించిన 'నీలం'

**పటాన్ చెరువిశాలభారతి :** పటాన్ చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండలం మంబాపూర్ గ్రామంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు అలీ అబ్బాస్ జాతర ఉత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ మంగళవారం చిట్కుల్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ తలారి దయానంద్, నాయకులు మద్దూరి లక్ష్మణ్, రాజు, విష్ణు, శ్రీనివాస్, పవన్, ఎం. శ్రీనివాస్, ఉత్సవ నిర్వాహకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక సాయం అందించిన ఎన్ఎంఆర్ మహిళ యువసేన

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** నిరుపేద కుటుంబానికి చెందిన గర్భవతి మహిళకు ఎన్ఎంఆర్ యువసేన మహిళా విభాగం ఆర్థిక సాయం అందించింది. గర్భవతిగా ఉండి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుందని తెలుసుకున్న ఎన్. ఎం.ఆర్ యువసేన మహిళ కార్యకర్తలు వై ఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న రేణు దేవికి 5000 రూపాయలు ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎన్ఎం ఆర్ యువసేన వ్యవస్థాపకులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఆనంద్ కృష్ణారెడ్డి ఆర్థిక సహాయం

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** మున్సిపల్ పరిధిలోని ఒడిస్సా కు చెందిన ప్రసాద్ రావు అనే వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఆనంద్ కృష్ణారెడ్డికి విషయాన్ని తెలియజేయగా అంత్యక్రియలకు పదివేల రూపాయలు మంగళవారం నాడు కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా కె.జె.ఆర్ ట్రస్టు ద్వారా నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా నిలుస్తానని తెలిపారు.






# బమ్మెరలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**పాలకుర్తి, విశాల భారతి:** పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో అంగన్వాడి ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ మాట్లాడుతూ.. "గర్భిణీ అని తెలియగానే ఎడబ్ల్యూసిలో, అలాగే ఏఎన్ఎం దగ్గర పేరు నమోదు చేసుకోవాలి అని అన్నారు. అంతే కాకుండా ఏడబ్ల్యుసిలో ఒకపూట భోజనం, రోజు ఒక కోడిగుడ్డు, 200ml పాలు సబ్ సెంటర్ లో హెల్త్ చెకప్, అలాగే క్రమం తప్పకుండా టీకాలు తీసుకోవాలి అన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్ లో డెలివరీ అవ్వాలి.. బిడ్డ పుట్టిన వెంటనే మూర్రు పాలు పట్టించాలి.. 6 నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టించాలి. ఆరు నెలలు నిండిన తరువాత అనుభందాహరం మొదలు పెట్టాలి.. దీనితో పాటుగా తల్లి పాలు పట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బొమ్మెర గ్రామ సర్పంచ్ జలగం నాగభూషణం, ఉప సర్పంచ్ శివరాత్రి సుధాకర్, సెక్రెటరీ రాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్ మల్లీశ్వరి, డబ్ల్యుటిఎస్ బిక్షంతార నాగమణి, ఆశా వర్కర్లు ప్రమీల, యాదమ్మ ఎలెంద్ర తల్లులు హాజరయ్యారు.



# గీతంలో అంతర్జాతీయ సదస్సు

**ఈ నెల 25 పత్ర సమర్పణకు తుది గడువు**

**పటాన్‌చెరువిశాలభారతి:** గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 1113 తేదీలలో 'ఘనీభవించిన పదార్థ భౌతిక శాస్త్రంలో పురోగతి' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్టు మంగళవారం వెల్లడించారు. ఆధునిక ఘనీభవించిన పదార్థ భౌతిక శాస్త్రంలో ముఖ్యమైన, తాజా పరిణామాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిపుణులు ఒకరికొకరు తెలియజేసుకునే క్రియాశీల వేదికను అందించడం, ప్రస్తుత పరిశోధనలోని ఆసక్తికర అంశాలు, వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకోవడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఘనీభవించిన పదార్థ పరిశోధనలో భవిష్యత్తు పోకడలపై దృక్పథాన్ని అందిస్తుందని, సంభావ్య సహకారాన్ని పెంపొందించే అవకాశాలను శోధించేలా ఈ సదస్సు ప్రేరేపిస్తుందన్నారు. అనుభవజ్ఞుల స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఉంటాయని, యువ శాస్త్రవేత్తల గోడ పత్రికల ప్రదర్శన (పోస్టర్ ప్రెజెంటేషన్) కూడా ఉంటుందని తెలిపారు. ఈ సదస్సులో పత్ర సమర్పణ ఆగస్టు 25వ తేదీలోగా చేయొచ్చని, నాణ్యమైన పరిశోధనా పత్రాలను ఎంపిక చేసి క్షుణ్ణంగా సమీక్షించిన ప్రొసీడింగ్లలో ప్రచురిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు https://forms.gle/sJkeDxwwpUjfsoCk9 లింక్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాల కోసం సదస్సు నిర్వాహకుడు డాక్టర్ ఐవీ సుబ్బారెడ్డి 96181 77690ని సంప్రదించాలని, icacmp 2023@gitam.eduకు ఈమెయిల్ చేయాలని, లేదా www.gitam.edu/ICACMP2023 ని సందర్శించాలని సూచించారు.




# రండి.. మొక్కలు తీసుకోండి

- మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి
- 9వ విడత హరితహారంలో భాగంగా మొక్కల పంపిణీ

**పటాన్ చెరు, విశాలభారతి:** మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి పిలుపునిచ్చారు. 9వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 3వ వార్డ్ వాని నగర్, 4వ వార్డ్ హెచ్ఎంటి స్వర్ణపురి కాలనీ, 5, 6వ వార్డ్ పిజిఆర్ కాలనీలో మొక్కల పంపిణీ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మునిసిపల్ చైర్మన్ పాండు రంగా రెడ్డి,మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి పాల్గొని ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పట్లోళ్ల కల్పన ఉపేందర్ రెడ్డి, చంద్రకళ గోపాల్, బిజిలి రాజు, మహాదేవ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, సీనియర్ నాయకులు చౌటకూరి మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# నగరానికి మంత్రి కేటీఆర్ రాక

- ప్రతిష్ఠాత్మక ఐటి హబ్ ను ప్రారంభించి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న ఐటీ మంత్రి
- అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలతో కలిసి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిన ఎమ్మెల్సీ కవిత
- నగరం గులాబీమయం
- భారీ స్వాగతానికి ఏర్పాట్లు
- పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్లో భారీ బహిరంగ సభ.



**నిజామాబాద్,విశాలభారతి:**

రాష్ట్ర ఐటీ పురపాలక పరిశ్రమల శాఖామంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు బుధవారం నిజామాబాద్ నగరానికి రానున్నారు. నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఐటీ హబ్ ను మంత్రి కేటీఆర్.. రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, రూరల్ ఎమ్మెల్యే, టిఎస్ఆర్టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తో కలిసి ఐటి హబ్ ను, దాని సమీపంలోనే నిర్మించిన న్యాక్ భవనాన్ని కేటీఆర్ ప్రారంభిస్తారు. ఖిల్లా రఘునాథ ఆలయం వద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్, పలు వైకుంఠ ధామాలు, తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. ఉపాధి కల్పనలో కీలకంగా మారిన ఐటీ కాపు ప్రారంభోత్సవ నేపథ్యంలో యువత ఆసక్తిగా, ఉత్సాహంగా పాల్గొననున్నారు.

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఐటీ హబ్ లను ద్వితీయ శ్రేణి నగరాలకు సైతం విస్తరించే కృషిని మంత్రి కేటీఆర్ చేపట్టారు. ఈ క్రమంలో నిజామాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా ఐటీ టవర్ హబ్ నిర్మాణం చేయించారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఐటి హబ్ నిర్మించారు. ఇటీవల ఐటీ హబ్ లో ఉద్యోగాల కోసం భారీ జాబ్ మేళా నిర్వహించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేత్యేకంగా దృష్టి నిలిపి జాబ్ మేళాను విజయవంతం చేశారు. 750 మందికి ఐటీ హబ్ లో ఉపాధి అవకాశాలు కల్పి కలిగేలా చేశారు. ఈ ఐ టి హబ్ లో ఎప్పటికప్పుడు ఉపాధి అవకాశాలను అందిస్తూనే ఉండాలని ప్రతి నెలా జాబ్ మేళా నిర్వహించేలా ఎమ్మెల్సీ కవిత ప్రణాళిక చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 29న మరో జాబ్ మేళా భూమా రెడ్డి కన్వెన్షన్ లో నిర్వహించనున్నారు.మంత్రి కేటీఆర్ రాక నేపథ్యంలో నగరం గులాబీమయంగా మారింది. ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేశారు.

**యువతకు ఉజ్వల భవిష్యత్తుకు బాట..**

రెండో దశ ఐటీ హబ్ ను కూడా అభివృద్ధి చేస్తాం.. జాబ్ మేళాలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన ఐటీ హబ్ స్థానిక యువత ఉజ్వల భవిష్యత్తుకు బాట వేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ ఐటీ హబ్ లో కంపెనీని స్థాపించండి.. గ్లోబల్ లాజిక్ కంపెనీని కోరిన ఎమ్మెల్సీ కవిత.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో సంస్థ ప్రతినిధుల భేటి .. నిజామాబాద్ లో కంపెనీ ఏర్పాటుకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని కవిత హామీ.. సానుకూలంగా స్పందించిన కంపెనీ ప్రతినిధులు.. మంగళవారం ఐటీ హబ్ ను సందర్శించనున్న కంపెనీ ప్రతినిధులు.. కాలిఫోర్నియాలో గ్లోబల్ లాజిక్ సంస్థ ప్రధాన కార్యాలయం... హైదరాబాద్ కార్యాలయంలో దాదాపు 3 వేల మంది ఉద్యోగులకు ఉద్యోగాలు రానున్నాయి.దృష్టి నిలిపి జాబ్ మేళాను విజయవంతం చేశారు. 750 మందికి ఐటీ హబ్ లో ఉపాధి అవకాశాలు కల్పి కలిగేలా చేశారు. ఈ ఐ టి హబ్ లో ఎప్పటికప్పుడు ఉపాధి అవకాశాలను అందిస్తూనే ఉండాలని ప్రతి నెలా జాబ్ మేళా నిర్వహించేలా ఎమ్మెల్సీ కవిత ప్రణాళిక చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 29న మరో జాబ్ మేళా భూమా రెడ్డి కన్వెన్షన్ లో నిర్వహించనున్నారు.



## జాయింట్ కమిషనర్ రామకృష్ణారావును కలిసిన అఖిల భారత హిందూ భక్త పరిరక్షణ మండలి

**పాలకుర్తి, విశాల భారతి:** పాలకుర్తి పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్య అన్నదాన సత్రాన్ని ప్రారంభించాలని అఖిల భారత హిందూ భక్త పరిరక్షణ మండలి అధ్యక్షులు దుంపల సంపత్ కోరారు. ఆ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులోని దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ విలేకరు సమావేశంలో మాట్లాడుతూ.. చారిత్రక నేపథ్యం కలిగిన పాలకుర్తి సోమేశ్వర ఆలయంలో నిత్య అన్నదాన సత్రం ఆలయ ప్రాంగణంలో నిర్మించారని.. భవనం పూర్తయినప్పటికీ దానిని ప్రారంభించలేదని ఆయన అన్నారు. వీర శైవ క్షేత్రంగా పాలకుర్తికి ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందని, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఇక్కడికి తరలి వస్తున్నరని గుర్తు చేశారు. నిత్య అన్నదాన సత్రం తక్షణ ఏర్పాటు అవసరమని, భక్తుల సౌకర్యార్థం కోసం వెంటనే నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. దేవాలయ టెండర్ పాత బకాయిలు ఏండ్ల తరబడి వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. దీనిపై కమిషనర్ రామకృష్ణారావు స్పందిస్తూ.. ఈ విషయాలపై చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారని సంపత్ తెలిపారు. ఇందులో ప్రధాన కార్యదర్శి కామరాపు సునీల్ పాల్గొన్నారు.



## ప్రజా యుద్ధనౌక గద్దరన్నకు విప్లవ జోహార్లు

**గరిడేపల్లి ,విశాలభారతి:** ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్న మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామంలో అఖిల భారత యువజన సమాఖ్య (Aiyf)మండల, గ్రామ కమిటీల అధ్వర్యంలోసోమవారం రాత్రి గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ అన్న తన ఆట, పాట,మాటతో తెలంగాణ ప్రజల్లో ఉత్తేజాన్ని నింపుతూ దొరల పెత్తనాలకు, దోపిడీ,దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిస్తూ ఉద్యమాలలో ముందున్నారని అన్నారు. ఏకే 47 కంటే గద్దర్ ఆట,పాట ప్రమాదమని ప్రభుత్వాలు నిర్ణయించుకొని, చంద్రబాబు ప్రభుత్వంలో 1997లో కాల్పులు జరిపితే ఒక బుల్లెట్ తన శరీరంలోనే ఉంచుకొని మరింత ఉత్సాహంతోటి ప్రజా ఉద్యమాల్లో ముందుండి ప్రజలను చైతన్యపరిచి తిరుగుబాటు నేర్పిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ అని అన్నారు.తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తనదైన శైలిలో పాటలు రాస్తూ,పాడుతూ, ఆడుతూ,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించాడని ఆయన అన్నారు.ఆయన మరణం నేటి ఉద్యమాలకు తీరని లోటని, అతను ప్రజల మనిషి అని అణగారిన జనం కోసం పోరాడే ప్రజా గొంతుకని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ గద్దర్ అన్నకు నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, Aiyf మండల కన్వీనర్ పంగ సైదులు,సోషల్ మీడియా మండల కన్వీనర్ షేక్ హాలీం,Aiyf గ్రామ అధ్యక్షులు చింతల చెర్వు పుల్లయ్య, కార్యదర్శి పంగ సైదయ్య, Aiyf మండల నాయకులు, ఈద ప్రసాద్, మెండే లింగరాజు కుర్రు లింగరాజు తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి నోచుకోని గిరి జీవనం

ప్రకృతితో మమేకమైన జీవనం వారిది. స్వచ్ఛమైన సెలయేళ్లు దట్టమైన అడవులు, గంభీరమైన కొండలు, పక్షుల కిలకిలారావాలు,పచ్చని ప్రకృతి అందాలు, వీటి మధ్య శతాబ్దాల సంస్కృతులకు గుర్తుగా, వెనకబాటుతనానికి సజీవ సాక్ష్యంగా పాలకుల ఆలనకోసం ఎదురుచూస్తూ అమాయక ఆదివాసీ గిరిజన జనం నివసిస్తోంది.అడవి తల్లి బిడ్డలుగా ప్రకృతి ఒడే ఆవాసంగా దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుని ప్రకృతి ప్రసాదిత ఫలాలతో సహవాసం చేస్తోంది. విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలకు నోచుకోని గూడేలెన్నో. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి75 సంవత్సరాలు దాటినా ఆదివాసీల జీవన స్థితిగతులు మారలేదు.ఆదివాసుల హక్కు పరిరక్షణ కోసం1994లో ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసుల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. బ్రెజిల్, పెరూ దేశాలలో వందకు పైగా ఆదివాసి తెగలు బయట ప్రపంచంతో సంబంధం లేకుండా ఉన్నారు. పెరూలోని 'ముచిపిచి' పర్యావరణ పార్కుకు కేవలం100 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఈ తెగలు ఇప్పటికీ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.50 నుంచి 60 వేల సంవత్సరాల నుంచి అటవీ దుంపలు ప్రధాన ఆహార వనరుగా జీవిస్తూ మొక్కజొన్న,బంగాళదుంప సాగుకు ఈ తెగలు ఎంతో తోడ్పడ్డాయి.వేటాడే జంతువులకు ఎరగా వేసే క్యురారే మొక్క నేడు ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సకు ఔషధంగా మారింది.ప్రపంచంలో సుమారు ఏడు వేల భాషలు ఉంటే అందులో గిరిజన తెగలు మాట్లాడే బాషలే నాలుగు వేలు ఉన్నాయి. నేడు అత్యధికులు మాట్లాడే,వాడే ఆరు భాషలు (ఇంగ్లీషుతో సహా) గతంలో అంతరించిపోయిన ఆదివాసీ తెగలు వాడినవే. బ్రతుకు పోరాటంలో ఆరితేరిన గిరిజనులు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడుతుండేవి.నేడు ఆ వనరులు దోపిడీకి గురౌతున్నాయి. 'అతి పురాతన సనాతన ప్రజల (మూలవాసులు) తెగలు అంతరించిపోతున్నాయి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు ,రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు కూడా లేవు. ఫలితంగా వారు మానవులుగా జీవించడానికి పోరాడవలసిన స్థితి ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ సనాతన ప్రజలను కాపాడవలసిన బాధ్యత మనపై ఉన్నది. అందుకు ప్రతి దేశం కొత్త చట్టాలు రూపొందించడం,వాటిని అమలుచేయడం,తద్వారా జీవించే హక్కుతో సహా ఆధునిక మానవునికి గల అన్ని హక్కులూ వారికి ఇవ్వవలసి ఉన్నదని 1994 డిసెంబర్ 23న ఐక్కరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 49/214 తీర్మానంలో పేర్కొన్నది. ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు ప్రతి దేశం దశాబ్ద కాలంపాటు ఆదివాసీ తెగలను గుర్తించి వారిని చట్టపరిధిలోకి తీసుకురావాలి. ఈ పదేళ్లపాటు ఆదివాసీ తెగలను మానవులుగా గుర్తించడం,వారి జీవన పరిస్థితులను మెరుగుపర్చడం, నివాస ప్రాంతాలలోని సహజవనరులన్నింటినీ వారే సమిష్టిగా వినియోగించుకునే చట్టాలు చేయవలసి ఉన్నది. ఇది 1995 నుంచి 2004 వరకు వివిధ రూపాలలో ప్రచార కార్యక్రమాలు, అధ్యయనాలు చేయవలసి ఉన్నది. రెండవ దశాబ్దంలో 2005 నుంచి 2015 వరకు ఆదివాసీ తెగల అస్తిత్వం,తగిన హోదా కల్పించవలసి ఉంది. పై తీర్మానంపై 148 దేశాలు సంతకాలు చేసినా, అమలుచేసిన దేశాలు కేవలం 60 మాత్రమే. ఈ 60లో భారతదేశం లేదు. మనదేశంలో ఇప్పటికీ అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వాలు జరపడం లేదు. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించబడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది.ఆదివాసుల సంరక్షణ,అభివృద్ధి కోసం రాజ్యాంగంలో ఆర్టికల్ షెడ్యూల్ల ప్రకారం గిరిజన ప్రాంతాల్లో ఉండే గవర్నర్లకు విచక్షణ అధికారాలను కల్పించారు. వీటిని ఉపయోగించి జాతీయ, రాష్ట్ర చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటివల్ల ఆదివాసుల సంస్కృతికి ఏమన్నా ముప్పు సంభవిస్తే,వాటిని ఆపే హక్కు ఉంది. అయితే గిరిజనేతరుల ఆశయాలమేర చట్టాలు అమలు పరుస్తుండటం దురదృష్టకరం. గిరిజన ప్రాంతాల్లోకి టూరిజం ప్రవేశించాక గిరిజన కళలో వ్యాపార సరుకులుగా మారిపోయాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం పాటించాలి. నేడు జరుగుతున్న ఉత్సవాల్లో పాలకవర్గాల అవసరాల కోసమే తప్ప ఆదివాసులను కాపాడడానికి కాదు. నిజమైన ఆదివాసి గిరిజన దినోత్సవం అంటే వారి అవసరాలు ఆకాంక్షలు నెరవేర్చే విధంగా అభివృద్ధి వైపు నడిపించే విధంగా ఉండవలసిన అవసరం ప్రభుత్వాలపై ఉంది.



**డాక్టర్ ఆర్ చంద్రు**
అసోసియేట్ ప్రొఫెసర్, హెచ్వోడి
డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్
ఉస్మానియా యూనివర్సిటీ.

## మృతిని కుటుంబాన్ని పరామర్శించిన ఉషమ్మ

**పాలకుర్తి,విశాలభారతి:** పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ కమ్మగాని మంజుల పరమేశ్వర్ కుమారుడు భాను ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు. ఈ మేరకు పరమేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, జిల్లా కో ఆప్షన్ నెంబర్ ఎండి మదర్, ఎంపిటిసి ఎడవెల్లి పురుషోత్తం, బిఆర్ఎస్



మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్, గ్రామపార్టీ అధ్యక్షులు కడుదుల కర్ణాకర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## పెండింగ్ రీయింబర్స్మెంట్ ఫీజులను వెంటనే విడుదల చేయాలి

**పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్**

**మహబూబాబాద్, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కేంద్రంలో పిడిఎస్యు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో తీవ్రంగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్స్, స్కాలర్ షిప్స్ రూ.5,500 కోట్లు పెండింగులో ఉన్నాయన్నారు. దీనితో అనేక మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇటు స్కాలర్ షిప్స్, అటు రియంబర్స్మెంట్స్ రాక ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఇంట్లో నుండి డబ్బులు కడితేనే తమ సర్టిఫికేట్లు ఇస్తామని లేకపోతే ఇవ్వమని అంటున్నారు. కావున వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. అవే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడలు లేక బయటి వ్యక్తులకు జల్సాల కోసం అడ్డాగా మారుతుందని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తా అని చెప్పి 4 సంవత్సరాలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం తాత్సరం చేస్తుందని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని శిథిలావస్థలో చేరుకున్న ప్రభుత్వ పాటశాలలకు, వసతి గృహాలకు స్వంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను వెంటనే పెంచాలని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇంజనీరింగ్ విద్యార్థులకు విచ్చలవిడిగా ఫీజులను పెంచింది. దీనితో విద్యార్థిలకు ఆర్థికంగా భారంగా మారుతున్న పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెంచిన ఫీజులను వెంటనే తగించాలని డిమాండ్ చేశారు. లేని యెడల పిడిఎస్యు ఆధ్వర్యంలో విద్యార్థులను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని.. దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దిలీప్, రఘు, జగదీష్, సంతోష్, శ్రీనివాస్, జైపాల్, నవీన్, రాంబాబు పాల్గొన్నారు.

## బామ్మర్ది మృతదేహాన్ని తరలిస్తూ రోడ్డు ప్రమాదంలో బావ మృతి

**మహబూబాబాద్, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణ కేంద్రంలో ప్రైవేట్ అంబులెన్స్ కల్వర్టును ఢీ కొట్టిన దుర్ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. బయ్యారం మండలం ఇస్లాపూర్ గ్రామానికి చెందిన గజ్జి సంపత్ (30) కామెర్లు వ్యాధికి గురికావడంతో హైదరాబాదు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. అప్పటికే ఆరోగ్యం విషమించడంతో సంపత్ మృతి చెందాడు. దీంతో సంపత్ పార్థివ దేహాన్ని అతని బావ ముద్ద సారయ్య (40) అంబులెన్స్ లో మృతుని స్వగ్రామనికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మరిపెడ పట్టణ శివారు కేంద్రంలో కల్వర్టును ఢీకొట్టడంతో సారయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అంబులెన్స్ డ్రైవర్ కు, గజ్జి అంజయ్యకు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు క్షతగాత్రులను మానుకోట ఏరియా ఆసుపత్రికి తర



లించారు. ఈ దుర్ఘటనకు నిద్రమత్తు కారణంగా తెలుస్తోంది. కాగా బావ, బామ్మర్ది మృతితో ఇస్లాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముద్ద సారయ్యకు ముగ్గురు ఆడపిల్లలు ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో బి.పి.ఎల్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉన్నట్లు సమాచారం.



## జహీరుద్దీన్ ఘనంగా నివాళులర్పించిన మైనార్టీ నాయకులు

**భువనగిరి,విశాల భారతి:** జర్నలిస్ట్ సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్ మృతికి సంతాపంగా యాదాద్రి భువనగిరి జిల్లా మైనార్టీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా మైనార్టీ చైర్మన్ షేక్ మజాహర్ పాషా బబ్లు మాజీ వర్క్స్ బోర్డు సభ్యులు మొహమ్మద్ షరీఫ్ ,టీపీసీసీ మైనార్టీ విభాగం మొహమ్మద్ రఫీయుద్దీన్ గౌరీ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నాక్ ప్రమోద్ కుమార్ జహీరుద్దీన్ అలీ ఖాన్ కి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతూ జహీరుద్దీన్ ఖాన్ మరణం తీరని లోటు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన ఆశయసాధనకు కాంగ్రెస్ పార్టీ తరపున ముందుండి నడుస్తామని జర్నలిస్టులకు మరియు మైనార్టీలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్లు కారం కొండ వెంకటేష్, వర్చర్ల కృష్ణ యాదవ్, ఈరోపాక నరసింహ, పడగల ప్రదీప్ రేణుక, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జిట్టా మల్లా రెడ్డి , పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మహమ్మద్ బాబా, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదాస్ గోవర్ధన్, గుమ్మడవెల్లి రమేష్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాహుల్ గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల మనోజ్, సీనియర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



## పెసర పంటతో నేలసారం పెరుగుతుంది

**కెవికే సీనియర్ శాస్త్రవేత్త బి.లవకుమార్**

**గరిడేపల్లి,విశాలభారతి:** పెసర పంట తో నేల సారం పెరుగుతుందని కేవికె సీనియర్ శాస్త్రవేత్త బి.లవకుమార్ అన్నారు.మంగళవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామములో రైతు సాగుచేసిన పెసర పంటను విద్యార్థులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసర పంటను వేసుకోవడం వలన కలిగే లాభాల గురించి వివరించారు. అంతే కాకుండా ఈ పంట వలన నేల సారం కూడా పెరుగుతుందన్నారు. పెసర లో పేనుబంక, పల్లాకు తెగులు మరియు శనగ పచ్చ పురుగు వంటివి గమనించారు. వీటి నివారణకు అసిఫేట్ 1.5 గ్రా లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రా లేదా నోవల్యూరిన్ 1 మి.లీ. 5 మి.లీ వేప నూనెతో లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అదే విధంగా పెసరలో తీసుకోవలసిన ఎరువుల యాజమాన్యం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవికే శాస్త్రవేత్తలు డి.ఆదర్శ్, కిరణ్ కుమార్, రైతులు బచ్చు సైదయ్య, జగన్నాథ్ యూనివర్సిటీ వ్యవసాయ డిగ్రీ విద్యార్థులు పవన్, నితీష్, నాగేంద్ర, తరుణ్ తదితరులు పాల్గొన్నారు

# అత్యున్నత స్థాయికి ఎదిగిన.. ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్



**ఓయూ,విశాల భారతి:** న్యాయవిద్యల అత్యున్నత స్థాయికి ఎదగడం సంతోషంగా తృప్తిగా ఉందని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా హెడ్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గాలి వినోద్ కుమార్ మాట్లాడారు. న్యాయవిద్యలో అత్యున్నత పదవి అయినా డీన్ ఫ్యాకల్టీ ఉస్మానియా, తెలంగాణ విశ్వవిద్యాలయాలకు అతి చిన్న వయసులో పదోన్నతి పొందడమే కాకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని 11 విభాగాల డీన్ లో సీనియర్ డిన్ గా ఎదగడం సంతోషంగా ఉందన్నారు. ఉస్మానియా 106 సంవత్సరాల చరిత్రలో ఒక దళితుడు చరిత్ర సృష్టించాడని ఏడేళ్ల తన పదవిని తృణప్రాయంగా సామాజిక తెలంగాణ సాధన కోసం స్వచ్ఛందంగా ఆగస్టు 16 నుండి వదులుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ప్రపంచ సదస్సులో పాల్గొని అనేక పరిశోధన పత్రాలు సమర్పించడమే కాకుండా న్యాయ విద్యార్థులకు సమాజానికి ఉపయోగపడే అనేక గ్రంథాలు రాశానని తెలిపారు. నా తల్లిదండ్రులు మొదటి తరం విద్యావంతునిగా చేస్తే బాబాసాహెబ్ అంబేద్కర్ రిజర్వేషన్ల వలన ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి సాధించడమే లక్ష్యంగా సామాజిక రాజకీయ న్యాయం సాధించడం దిశగా ముందుకు సాగుతానని తెలిపారు. ఎవరి జనాభా ఎంతో వారికంత వాటా అన్ని రంగాల్లో వచ్చే విధంగా నా భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. 2024లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుండి పోటీ చేస్తానని అందుకే ఆగస్టు 16 నుండి స్వచ్ఛంద పదవి విరమణ పొందుతున్నానని వివరించారు.

# వక్ఫ్ బోర్డు ఉద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కారం

**మంత్రులను కలిసిన ముజీబ్**

**హైదరాబాద్,విశాల భారతి:** తెలంగాణ ప్రభుత్వంలో ఏ ఉద్యోగులు అన్యాయం జరగదని వక్ఫ్ బోర్డు ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కారం అవుతాయని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ ఎం హుస్సేన్ ముజీబ్ అన్నారు. ఈ మేరకు కేంద్ర సంఘం అధ్యక్షుడు రాజేందర్ ప్రధాన కార్యదర్శి జగదీష్ తో కలిసి ముజీబ్ మంగళవారం హైదరాబాదులోన మంత్రులు మహమ్మద్ అలీ, కొప్పుల ఈశ్వర్ ను కలిశారు. ఈ సందర్భంగా బోర్డులో నెలకొన్న ఉద్యోగుల సమస్యలు పరిస్థితులను వారికి వివరించారు. వక్ఫ్ బోర్డులో ఉద్యోగ విరమణ వయసు 61 సంవత్సరాలు నుంచి 60 సంవత్సరాల తగ్గించారని ప్రభుత్వ ఉత్తర్వులను బోర్డు ఉల్లంఘించిందని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఏ ఉద్యోగి కి అన్యాయం జరగకుండా బోర్డు ఉద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని మంత్రులు హామీ ఇచ్చారని ముజీబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సత్యనారాయణ గౌడ్, రాజేందర్, బూరుగు రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.







# చదువుకునే అవకాశం సద్వినియోగం చేసుకోండి

**మణుగూరు, విశాల భారతి :** చదువుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, మణుగూరు ఎంఈఓ వీరస్వామి అన్నారు. మంగళవారం జడ్పీ కో ఎడ్యుకేషన్ పాఠశాలలో ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రెగ్యులర్ గా పాఠశాలకు వెళ్లి చదువుటకు అవకాశం లేని వారందరూ ఈ ఓపెన్ స్కూల్ విధానం సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీని ద్వారా అడ్మిషన్ పొంది పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుటకు మంచి అవకాశం అని తెలియజేశారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో కేవలం ఐదు సబ్జెక్టులతో పరీక్షలు రాసి పాస్ కావచ్చునని తెలియజేశారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులందరూ, మీరు పనిచేయుచున్న పాఠశాలల పరిధిలో గల ప్రాంతాల్లో ఈ విషయంను తెలియజేసి, ఎక్కువమంది చదువుకొనే విధంగా ప్రోత్సహించగలరని కోరారు. రరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్య కార్మికులకు అండగా పిల్లుట్ల రఘు

**ఓజో ఫౌండేషన్ ఇంచార్జి కుక్కల వెంకన్న**

**హుజూర్ నగర్,విశాలభారతి:** హుజుర్ నగర్ మండల కేంద్రాలలోనీ ఎంపీడీఓ ఆఫీస్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన నిర్వదిక సమ్మె కార్యక్రమనికి ఓజో ఫౌండేషన్ అధినేత ఆదేశాల మేరకు ఓజో ఫౌండేషన్ నియోజకవర్గ ఇంచార్జి కుక్కల వెంకన్న పాల్గొని వారికి సంఘీభావం తెలిపినారు ఈ సందర్భంగా వాళ్లకు 100కేజీల బియ్యం మరియు 5000 /రూపాయలు ఆర్థిక సాయంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కుక్కల వెంకన్న మాట్లాడుతూ ఈ రోజు గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయి అంటే దానికి కారణం పారిశుధ్య కార్మికులే కాబట్టి వారు ఈ రోజు పడుతున్న ఇబ్బంది మీ అందరికి తెలుసు ఈ రోజులలో రోజు వారి కూలి సుతరి పనికి వెళ్తే 800/ రూపాయలు అలాంటిది ఒక రోజుకు కూలి 300/రూపాయలకు పని చేయాలంటే వారి ఇల్లు గడవడమే కష్టంగా ఉంటుంది వారి పిల్లల చదువు ఏమిపెట్టి చదివించుకోవాలి వారికి ఏదైనా రోగం వస్తే ఏమి పేట్టి చూపించుకోవాలి కాబట్టి తక్షణమే వారి న్యాయమైన డిమాండ్ ను పరిష్కరించి నెలకు కనీసం 19500/రూపాయలు ఇచ్చి జీవో 51ను రద్దు చేసి జీవో 60 అమలాపరిచి వారిని గౌరవించాలి అని డిమాండ్ చేశారు. ఈ సమస్య ఇలాగే ఉంటే రాబోయే రోజులలో రఘు అన్న ఎమ్మెల్యే అయినా తర్వాత పార్టీలకు అతితంగా ఏడు మండలలో ఉన్న పారిశుధ్య కార్మికులందరికి న్యాయం చేసే విదంగా కృషి చేస్తా అన్నారు. అవసరమైతే తన సొంత ఖర్చులతో ప్రతి ఒక్క గ్రామ పంచాయితీ సిబ్బందికి హెల్త్ ఇన్సూరెన్స్ చేపించి వారిని ఆదుకుంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అస్సాంమియా ఉపాధ్యక్షులు అలవాలా కొండలు కార్యదర్శి అమరావరపు వీరరెడ్డి, గండు మధు, పల్లె క్రాంతి, ఆవులపాటి శ్రీను, బొమ్మకంటి సైదులు, పెండం వినయ్, ఆధురి వెంకన్న పారిశుధ్య కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ముదిరాజుల రిజర్వేషన్ సమస్య పరిష్కరించాలి

- ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు శివ ముదిరాజ్.

**హైదరాబాద్,విశాల భారతి:** ముదిరాజుల రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు శివ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాదులోని గన్ పార్క్ వద్ద ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో లక్ష పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా పోస్ట్ కార్డులతో నిరసన తెలిపిన శివ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులకు జరుగుతున్న అన్యాయాలపై ముదిరాజ్ చైతన్య వేదిక "లక్ష పోస్ట్ కార్డుల" ఉద్యమానికి తెర లేపిందన్నారు. తెలంగాణలో అతి త్వరలో జరుగబోయే ఎన్నికల్లో, తెలంగాణలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజులకు 15 ఎమ్మెల్యే టిక్కెట్లు తో పాటు రిజర్వేషన్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అందుకోసమే ఈ లక్ష పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. తెలంగాణ ఉన్న అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు లెటర్స్ రాసి ముదిరాజ్ ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే దిశగా ఈ ఉద్యమం సాగుతుందని ముదిరాజ్ మహిళ రాష్ట్ర నాయకురాలు కోట్ల పుష్పలత ముదిరాజ్ అన్నారు. ఈ ఉద్యమంలో రాజకీయ పార్టీలకు, సంఘాలకు, ప్రాంతాలకు అతీతంగా పాల్గొని ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, కురుమూర్తి, నర్సింహా, సీతా మహాలక్ష్మి, సురేష్, వేంకటేశ, మహేష్,రాకేష్, జగదీష్ , కార్తిక్ పాల్గొన్నారు.

# గృహలక్ష్మి పథకంపై ప్రజలు అయోమయం అవస్థలు పడనవసరం లేదు

**- బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అరికిళ్ళ తిరుపతిరావు**



**భద్రాచలం,విశాలభారతి:** గృహలక్ష్మి పథకం త్వరలో నియమ నిబంధనలు వస్తుందని ప్రభుత్వం ఇస్తాదని గత రెండు మూడు నెలల నుండి ప్రజలను సిద్ధం చేయడం జరిగినది ప్రజలు అందరూ వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తయారు చేసుకుని ఉన్నారు కానీ కొంతమంది మాత్రమే వారి సర్టిఫికెట్లు తయారు చేసుకోలేకపోయినారు కానీ దీనిలో అధికారుల ఆలస్యంగానీ అధికారుల నిర్లక్ష్యం గానీ ఏమీ లేదని ఇప్పటికైనా ప్రజలు వారికిసంబంధించిన ఆధార్ కార్డు రేషన్ కార్డు ఓటర్ ఐడి భూమికి సంబంధించిన పత్రాలు మరియు కుల ధ్రువీకరణ పత్రం ఆదాయ ధ్రువీకరణ పత్రం రెసిడెన్సి ధృవీకరణ పత్రాలు ఒకటి రెండు తక్కువైనా సంబంధిత అధికారులు మీ ధ్రువీకరణ పత్రాలను తీసుకోవటానికి ఎ ట్టి విధమైన అభ్యంతరం లేదని లబ్ధిదారులే స్వయంగా వెళ్లి స్థానిక తాసిల్దారు కలిసి మీకు సంబంధించిన దరఖాస్తులను అందజేయవలసినదిగా మేము కోరుతున్నాము.కానీ దీన్ని కొంతమంది నాయకులు ప్రజలను తికమక పెడుతున్నారు ఇది వారికి భావ్యం కాదని మేము వారిని కోరుతున్నాము అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకోగలరని ప్రజలు ఏమీ ఆందోళన చెందవలసిన అవసరం లేదని అధికారులు పూర్తి సమాచారం కోసం మీ ఇండ్ల వద్దకు వచ్చి సమాచారం సేకరించేటప్పుడు మీరు జత పరచలేని పత్రాలు వారికి అంద



# పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

**-గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్.**

**తొర్రూర్ విశాల భారతి:** ఈనెల 13న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 వ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలని గోపా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.మంగళవారం డివిజన్ కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్న గౌడ్ బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన మహానీయుడని కొనియాడారు.మామూలు గౌడ కుటుంబంలో జన్మించిన పాపన్న గౌడ్ తాడి ఎక్కి కల్లుగీస్తే కల్లు అమ్మితే ఏం వస్తుందని కొడితే గోల్కొండ కోటనే కొట్టాలని పాపన్న గౌడ్ 12 వేల సైన్యంతో గోల్కొండ కోటను జయించిన మహావీరుడని,ఆశయ సాధనకు గౌడులందరు కృషిచేయాలిని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐజేయు జాతీయ కౌన్సిలర్ సభ్యులు దూల శ్రీనివాస్ గౌడ్, గోపా డివిజన్ అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్ గౌడ్,గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మల వెంకన్న గౌడ్, గోపా మండల అధ్యక్షులు రాయపల్లి యాకయ్య గౌడ్,కౌండిన్య సహకార పర్పస్ సంఘం అధ్యక్షులు నాగపురి అశోక్ గౌడ్,సర్దార్ సర్వాయి పాపన్న అసోసియేషన్ అధ్యక్షులు కోటగిరి కుమార్ స్వామి గౌడ్,గోపా జిల్లా ఉపాధ్యక్షులు పి. రమేష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చీకటి అశోక్,రావుల యాదగిరి గౌడ్,గౌడ సంఘాల సలహాదారులు ఉమ్మగాని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# సర్వే చేసి పోడు భూములకి పట్టాలివ్వాలి

- పేదల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి
- సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకులు ముద్దా బిక్షం

**అశ్వాపురం,విశాలభారతి:** పోడు భూముల సమస్యలపై సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మణుగూరు, అశ్వాపురం సంయుక్త మండలాల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అశ్వాపురంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ కి అందజేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకులు ముద్దా బిక్షం మాట్లాడుతూ.. పోడు సాగుదారులందరికి పట్టాలిస్తానని హామీ ఇచ్చిన కేసిఆర్, సర్వే చేసిన తరువాత సగం మందికంటే తక్కువ మందికి పట్టాలిచ్చి, మిగిలిన వారి గురించి తరువాత ఆలోచిస్తానని దాటవేత కబుర్లు చెప్పడం ఎన్నికల జిమ్మిక్కు లేనని అన్నారు. సర్వే చేసిన పోడు భూములన్నిటికి పట్టాలివ్వాలని, సర్వే చేయని వారికి వెంటనే సర్వే నిర్వహించి, వలస ఆదివాసీలు, గిరిజనేతర పేదలకు పట్టా హక్కులు కల్పించాలని, పోడు సాగుదారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆయన అన్నారు. పోడు సాగుదారుల పై పారెస్ట్, పోలీసు అధికారుల దాడులు, దౌర్జన్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ మణుగూరు, అశ్వాపురం సంయుక్త మండలాల కమిటీ కార్యదర్శి ఎండి గౌస్, అశ్వాపురం మండల ఆర్గనైజర్ కాంపాటి జీవన్, మండల నాయకులు కోళ్ల వెంకటేశ్వర్లు, పాయం రామారావు, కీర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.



# కంటోన్మెంట్ బోర్డు లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ

- కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రం సాయం.
- 9 ఏళ్ళ బీఆర్ఎస్ పాలన లో ప్రజలకు మొండి చేయి.

**హైదరాబాద్విశాల భారతి:** కేంద్రం ఇచ్చిన నిధులతోనే కంటోన్మెంట్ బోర్డు లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ ఫనులు చేపట్టినట్లు బోర్డు స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం రెండో వార్డ్ లో లక్షల రూపాయలు వెచ్చించి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. 9 ఏళ్లుగా రాష్ట్రమును పాలిస్తున్న సీఎం కెసిఆర్ మంత్రి కేటీర్ కంటోన్మెంట్ అభివృద్ధి ని గాలికి వదిలేశారని ఆరోపించారు. నిధుల కేటాయింపు లో కూడా వివక్ష చూపేరని మండిపడ్డారు. కేవలం కేంద్రం విడుదల చేసిన నిధులతోనే అభివృద్ధి ఫనులు ముందుకు సాగుతున్నాయని వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సేవలు అందుబాటులోకి వస్తే నియోజకవర్గం లో 100 గజాల లోతుకు భవనాలు నిర్మాణం అవకాశం ఉండాలి స్పష్టం చేశారు..ఈ కార్యక్రమంలో మాదారపు అశోక్ కుమార్ బిజెపి వార్డ్ నెంబర్ 2 అధ్యక్షులు, శివఅభిషేక్,రవి, రామాంజనేయులు, వై మల్లేష్, యాదవ్,జగన్,ప్రశాంత్,లక్ష్మణ ,సురేష్ ,సదానంద్,గంగాధర్ , అజయ్,దత్తు,సంజయ్, సాయికుమార్,రాజు,దశరథ్ మరియు స్థానిక బస్తి మహిళలు పాల్గొనడం జరిగింది.



# యువజన సంఘం భవన నిర్మాణం కొరకు ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

**భువనగిరి టౌన్,విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వలిగొండ మండలం కేచుపల్లి గ్రామంలోని యువజన సంఘం భవన నిర్మాణం కొరకు భువనగిరి ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి ని సర్పంచ్ మద్దేల మంజుల నాగరాజ్ యువజన నాయకులు కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మంజూరు చేయడం జరిగింది. ఎమ్మెల్యేకు గ్రామ పంచాయతీ తరపున గ్రామ ప్రజలు, వార్డు మెంబర్లు, యువజన నాయకులు ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ టౌన్ ప్రెసిడెంట్ లింగస్వామి ఉపాధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షుడు, ప్రజలు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఎంతో తోడ్పడుతున్న సీఎం సహాయనిధి

**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల మండలం చిన్నమదూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు నేరుగా లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. చిన్నమదూరు గ్రామంలో ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రిలో డబ్బులు వెచ్చించి చికిత్స చేసుకోగా అక్కడ అయిన ఖర్చులలో సీఎం సహాయ నిధి నుండి మంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గాదరి వీరస్వామి రూ. 42500 ఇంటి వద్దకు వెళ్లి చెక్కును అందజేసారు. గ్రామ సర్పంచ్ వంగ పద్మ వెంకటేశ్వర్లు గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి ద్వారా ఎన్నో పేద కుటుంబాలు మెరుగుపడ్డాయి. తద్వారా కెసిఆర్ కు, దయాకర్ రావుకి ఎంతో రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు జనగామ



సంతోష్, టిఆర్ఎస్ యువజన నాయకులు వంగ అర్జున్ గౌడ్, కంకటి యాదగిరి, రాంపల్లి నర్సయ్య, బెజగం ఐలయ్య, మేడ సోమ నరసయ్య, మేడ అంజయ్య, మహంకాళి నారాయణ, ఎల్లయ్య, సోమయ్య, యాదగిరి, శేఖర్, మడికొండ ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.




# ములుగు తుఫాను బాధితులకు ఆర్థికంగా సహకరించండి

- తుఫాను వలన అన్ని రకాలుగా నష్టపోయిన ప్రజానీకానికి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి
- విరాళాల కోసం గార్ల మండల కేంద్రంలో న్యూడెమోక్రసీ కార్యకర్తలు

**మహబూబాబాద్, విశాల భారతి:** రాష్ట్రవ్యాప్తంగా గత నెలలో కురిసిన వర్షాల తుఫాను బీభత్సం ప్రభావంతో ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో రైతులకు, ప్రజలకు అపార నష్టం కలిగింది. ముఖ్యంగా ములుగు ప్రాంతంలో చాలామంది వాగులు వరదలలో కొట్టుకుపోయి చనిపోయారు.. ఇండ్లు నేల మట్టమై పశువులు వాగుల్లో కొట్టుకుపోయాయి. కేవలం అక్కడి ప్రజలు కట్టుబట్టలతో మాత్రమే మిగిలారు. అందుకు నిన్న న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో గార్లలో విరాళాల కార్యక్రమం చేపట్టాము. అందుకు ప్రజలు అన్ని రకాలుగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు సూత్రపు మనోహర్, పి వై ఎల్ జిల్లా కార్యదర్శి సిహెచ్ గణేష, ఏఐకేఎంఎస్ మండల ఉపాధ్యక్షులు మానియా దిలీప్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# 'భోళా శంకర్' నుంచి తీనుమారు సాంగ్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ మెగా మాస్‌యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ ఆగస్ట్ 11న థియేటర్లలోకి రానుండడంతో థియేటర్లలో మెగా యుఫోరియాకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. సినిమా ప్రమోషన్ లు దూకుడుగా జరుగుతుతున్నాయి. నిన్న భోళా శంకర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది. ఈ రోజు మేకర్స్ మరో బిగ్ ట్రీట్ ఇచ్చారు. ఈ చిత్రం నుంచి తీను మారు పాటని విడుదల చేశారు. మహతి స్వరసాగర్ ఈ పాటని గ్రాండ్ కార్నివాల్ ఎనర్జిటిక్ నెంబర్ గా స్కోర్ చేశారు. రాహుల్ సిప్లిగంజ్ వాయిస్ మెస్మరైజ్ చేయగా కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం పండగని రెట్టింపు చేసింది. ఈ పాటలో మెగాస్టార్ ఎనర్జిటిక్ గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ కన్నుల పండగలా వున్నాయి. ఫ్లూట్ తో చేసిన సిగ్నేచర్ స్టెప్ అవుట్ స్టాండింగ్ గా వుంది. ఈ పాటలో కీర్తి సురేష్ కూడా మెగా ఎనర్జీని మ్యాచ్ చేశారు. చిత్ర తారాగణం అంతా కనిపించిన ఈ పాట బిగ్ స్క్రీన్ పై చూడటానికి మెగా ట్రీట్ లా వుండబోతుంది.



# నాగార్జునను అన్న అనేసిన పూజా హెగ్డే..!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా ఎదిగింది పూజా హెగ్డే. ఈ మధ్యే కాస్త ఈ బ్యూటీ జోరు తగ్గింది. కానీ, మొన్నటి వరకు దాదాపు అందరు స్టార్ హీరోల పక్కన నటించింది. సినిమాలు తగ్గడంతో అందరూ పూజ పని అయిపోయింది అనుకున్నారు. కానీ పూజ, ప్రకటనలతో బిజీ అవుతోంది. తాజాగా ఆమె మాజా ప్రకటనలో నటించింది. ఈ ప్రకటనలో ఆమెతో పాటు, కింగ్ నాగార్జున కూడా కనిపించడం విశేషం. అయితే, దీనిలో నాగార్జునను పూజా అన్నయ్య అని పిలవడం హైలెట్. నాగ్ ఇద్దరు కుమారులు నాగ చైతన్య, అఖిల్ ఇద్దరితోనూ హీరోయిన్ గా నటించిన పూజ, చివరకు నాగ్ ని అన్నయ్య అని పిలవడం ఇప్పుడు విశేషం. ఆ ప్రకటన ప్రకారం వారంతా ఫ్యామిలీ. నాగార్జున తన శివ సినిమాలోని పాటలను హమ్ చేస్తూ ఉంటాడు. ఆ పాటకు ఇంట్లోని సభ్యులంతా సింక్ అయ్యి హమ్ చేస్తూ ఉంటే, నాన్ సింక్ లో వచ్చి పూజ పాట దారుణంగా పాడుతుంది. ఆమె పాటకు అందరూ షాకౌతారు. కానీ, నాగ్ మాత్రం పాట బాగా పాడకపోయినా డ్యాన్స్ బాగా వేస్తుంది కదా అమ్మూ అని సపోర్ట్ చేస్తాడు. వెంటనే అన్నయ్య అని పిలుస్తుంది. అందరూ సరదాగా నవ్వేస్తారు. ఇప్పుడు ఈ యాడ్ వైరల్ గా మారింది. ఈ వీడియోని సోషల్ మీడియాలో పూజ నే షేర్ చేసింది.' కుటుంబంలో అందరినీ అంగీకరించడం కూడా ఔదార్యమే' అంటూ క్యాప్షన్ పెట్టింది. మాజా కుటుంబాన్ని ఒకటి చేస్తుంది అంటూ, మాజా తాగిద్దాం, అందరికీ చేరువౌదాం అంటూ క్యాప్షన్ లో పేర్కొంది. కాగా, ఈ వీడియోకి నెటిజన్లు, లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఎక్కువ నాగ్ మీదే కామెంట్స్ చేస్తున్నారు. నాగార్జున ఏజ్ పెరగడం ఆగిపోయింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక, పూజ అందంగా ఉంది. ఈ వీడియోలో నాగ్ లుక్ చాలా మెస్సీ గా ఉంది. ఇదిలా ఉండగా, ప్రస్తుతం పూజ కొత్తగా ఏ సినిమా అంగీకరించడం విశేషం.

# వాల్తేరు వీరయ్య చరిత్రని తిరగరాసినట్లుగా అనిపించింది




మెగాస్టార్ చిరంజీవి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వాల్తేరు వీరయ్య', మాస్ మహారాజా రవితేజతో కలిసి నటించిన చిత్రం 2023 సంక్రాంతికి విడుదలై టాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. బాబీ కొల్లి దర్శకత్వం వహించిన ఈ చిత్రం థియేటర్లలో విజయ వంతంగా 200 రోజులను పూర్తి చేసుకుంది. ఇది చిరంజీవి, రవితేజలకు బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్స్‌లో ఒకటి. సినిమా 200 రోజుల రన్ పూర్తి చేసుకున్న సందర్భంగా మేకర్స్ టీమ్ మొత్తానికి, డిస్ట్రిబ్యూటర్లకు షీల్డ్స్ అందించారు. మెగాస్టార్ చిరంజీవి, మాస్ మహారాజా రవితేజ పాల్గొన్న ఈ గ్రాండ్ ఈవెంట్ లో దర్శకులు హరీష్ శంకర్, గోపీచంద్ మలినేని, బుచ్చిబాబు సాన హాజరయ్యారు. ఈ ఈవెంట్ లో మెగాస్టార్ చిరంజీవి గారు మాట్లాడుతూ.. ''ఒకప్పుడు సినిమాలు 100, 175, 200 రోజులు.. సిల్వర్ జూబ్లీ లు ఆడేవి. ఇప్పుడు.. రెండు వారాల్లో అటు ఇటు తేలిపోతుంది. ఇలాంటి నేపథ్యంలో 'వాల్తేరు వీరయ్య' 200 రోజులు ప్రదర్శించడం ఆనందంగా ఉంది. రెండు వందల రోజులు సినిమా ఆడి, విజయానికి గుర్తుగా షీల్డ్ ఇచ్చిపుచ్చుకోవడం చూస్తుంటే ఒళ్లు పులకరిస్తోంది. అందరు కలసికట్టుగా పని చేస్తే మళ్ళీ ఇలాంటి రోజు వస్తుందనడానికి ఇది నిదర్శనం. చరిత్రను తిరగరాసినట్టుగా అనిపిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ గారు, రవి గారు చెర్రీ గారికి నా హృదయపూర్వక అభినందనలు. నా తమ్ముడు రవితేజ ఈ సినిమా ఒప్పుకోవడం అనేది ఈ సినిమా మరో స్థాయికి వెళ్ళడానికి కారణం. తను సహాయ దర్శకుడిగా ఉన్నప్పటి నుంచి తెలుసు. ఈ రోజు మాస్ మహారాజా గా ఎదగడం చాలా సంతోషాన్ని ఇస్తుంది. తను మోస్ట్ బిజియస్ట్ హీరో. ఏడాదికి దాదాపు ఐదు సినిమాలు చేస్తున్నాడు. ఇది చాలా మంచి పరిణామం. ఎక్కువ సినిమాలు చేస్తే ఎంతో మందికి ఉపాది లభిస్తుంది. తన వేగంతో నేనూ ధీటుగా ముందుకు వెళ్ళగలుగుతున్నాను(నవ్వుతూ). తను ఇదు సినిమాలు చేస్తున్నాడు. నేను సుస్మితకి ఒక సినిమా, యువీ క్రియేషన్ కి మరో సినిమా చేస్తున్నాను. వాల్తేరు వీరయ్యకి పని చేసిన అందరికీ ధన్యవాదాలు.'' తెలిపారు

# 'దసరా' గ్రాండ్ గా 100 డేస్ షీల్డ్స్ ప్రజంటేషన్

నేచురల్ స్టార్ నాని మాసియస్ట్ పాన్ ఇండియా ఎంటర్ టైనర్ 'దసరా' 2023 మార్చి 30న ప్రపంచ వ్యాప్తంగా విడుదలై బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. నాని కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం సంచలన విజయం సాధించి సక్సెస్ ఫుల్ గా 100 రోజులని పూర్తి చేసుకుంది. ఈ సందర్భం మేకర్స్ చిత్ర యూనిట్, డిస్ట్రిబ్యూటర్లకు షీల్డ్స్ అందించారు. హీరో నేచురల్ స్టార్ నాని పాల్గొన్న ఈ గ్రాండ్ ఈవెంట్ లో నిర్మాతలు అనిల్ సుంకర, నాగ వంశీ, సాహుగారపాటి, గోపి అచంట హాజరయ్యారు.శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించారు. కీర్తి సురేష్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో దీక్షిత్ శెట్టి, సముద్రఖని, షైన్ టామ్ చాకో, సాయి కుమార్ కీలక పాత్రలు పోషించారు. సంతోష్ నారాయణ్ సెన్సేషనల్ ఆల్బమ్ అందించారు.





# గీతా ఆర్ట్స్ - #NC23 ఎక్స్‌పెడిషన్, ది ఫస్ట్ కట్ డాక్యుమెంటేషన్



యదార్థ సంఘటనల ఆధారంగా, రియల్ లొకేషన్‌లలో రూపొందించే చిత్రాలకు ప్రీప్రొడక్షన్ చాలా ముఖ్యం. నాగ చైతన్య 23వ చిత్రానికి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. లెజెండరీ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించడానికి మేకర్స్ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అందుకోసం కొత్త విధానాన్ని అనుసరించారు. ప్రీప్రొడక్షన్‌ను ప్రారంభించడానికి, #NC23 టీం కోస్టల్ ఆంధ్రప్రదేశ్ పర్యటించింది. శ్రీకాకుళంలోని కె.మత్స్యలేశం గ్రామాన్ని సందర్శించింది. నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ.. ''హైదరాబాద్‌లో కూర్చొని ఈ కథను రూపొందిచడం కాదని దర్శకుడు భావించారు. నేరుగా ఇక్కడికి వచ్చి ఇక్కడి ప్రజలు, వాతావరణాన్ని అధ్యయనం చేస్తూ చాలా జాగ్రత్తలు తీసుకుని ప్రీ ప్రొడక్షన్‌ను ముందుకు తీసుకెళ్తున్నాం' అన్నారు. దర్శకుడు చందూ మొండేటి మాట్లాడుతూ.. ''ఈ గ్రామానికి వచ్చి ప్రతి అంశానికి సంబంధించిన వివరాలను పరిశీలించిన తర్వాత మా ప్రీ ప్రొడక్షన్ వర్క్ స్టార్ట్ అయ్యింది '' అన్నారు. హీరో నాగ చైతన్య మాట్లాడుతూ.. '' పాత్రలన్నిటిని కలసి, వారి బాడీ లాంగ్వేజ్, పల్లె పరిస్థితులు, వారి జీవనశైలిని అర్థం చేసుకోవడానికి ఇక్కడికి వచ్చాం'' అన్నారు.

# కుమారికి వెబ్ సీరీస్ లు కూడా కలిసి రావట్లేదు..!

అంతకుముందు అలా ఎలా అనే సినిమాతో తెలుగు సినిమాల్లో తెరంగేట్రం చేసిన హెబ్బా పటేల్ సుకుమార్ దృష్టిలో పడి కుమారి 21ఎఫ్ సినిమా ఛాన్స్ అందుకుంది. ఆ సినిమా యూత్ ఫుల్ హిట్ అవడంతో కుమారి హెబ్బా రేంజ్ పెరిగిపోయింది. ఆ టైం లో హెబ్బా సరైన కథలు ఎంపిక చేసుకుని ఉంటే కచ్చితంగా ఆమె కెరీర్ వేరేలా ఉండేది కానీ ఆ టైం లో తనకు వచ్చిన ప్రతి సినిమా చేస్తూ వెళ్లింది అమ్మడు. అలా చేయడం వల్ల ఆమె కెరీర్ రిస్క్ లో పడింది. కొన్ని సినిమాల్లో కేవలం ఆమెకు ఒకటి రెండు డైలాగ్స్ మాత్రమే ఉన్న సందర్భాలు ఉన్నాయి. ఛాన్స్ లు లేని టైం లో ఎలాగైనా సినిమాల్లో కనిపించాలని స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది హెబ్బా పటేల్. అయితే సిల్వర్ స్క్రీన్ పై అవకాశాలు లేని ఇలాంటి వారికి ఓటీటీ ప్లాట్ ఫాంస్ మంచి వేదికగా మారుతున్నాయి. ఈ క్రమంలో హెబ్బా పటేల్ కూడా డిజిటల్ ఎంట్రీ ఇచ్చింది. ఆల్రెడీ అంతకుముందు ఆహా కోసం మస్తీస్ అనే వెబ్ సీరీస్ చేసిన హెబ్బా పటేల్ లేటెస్ట్ గా జీ 5 లో వ్యవస్థ అనే సీరీస్ చేసింది. ఈ సీరీస్ పై అమ్మడు చాలా హోప్స్ పెట్టుకుంది కానీ అది కూడా అంతగా వర్క్ అవుట్ అయినట్టు లేదు. సినిమాలు లేక వెబ్ సీరీస్ లు చేస్తున్న హెబ్బా పటేల్ ఇక్కడైనా లక్ కలిసి వస్తుందేమో అనుకుంటే అక్కడ కూడా తన బ్యాడ్ టైం కొనసాగుతుంది. అయితే తెలుగులో ఆమె చేసిన సినిమాల వల్ల అమ్మడికి తమిళ సినిమా ఛాన్స్ లు వస్తున్నాయి. ప్రస్తుతం తమిళంలో రెండు సినిమాలు చేస్తుంది హెబ్బా పటేల్. తెలుగులో కూడా తెలిసినవాళ్లు సినిమాలో నటిస్తుంది హెబ్బా పటేల్. సోలో హీరోయిన్ గా ఛాన్స్ లు రాకపోయినా స్టార్ సినిమా అయితే స్పెషల్ సాంగ్ అయినా చేసేందుకు రెడీ అంటుంది హెబ్బా పటేల్. తెలుగు తమిళంలో తన సత్తా చాటాలని ప్రయత్నిస్తున్న హెబ్బాకి చేస్తున్న సినిమాలతో అయినా లక్ కలిసి రావాలని ఆశిద్దాం. సుకుమార్ ప్రొడక్షన్ లో ఫస్ట్ హిట్ అందుకున్న హీరోయిన్ ఇలా కెరీర్ ఫెడవుట్ అవడం అందరిని ఆశ్చర్యపరుస్తున్నా క్రేజ్ వచ్చినప్పుడే కథల మీద చేస్తున్న సినిమాల గురించి జాగ్రత్త పడాలని హెబ్బాని చూస్తేనే అర్థమవుతుంది.

# సీరియస్ లుక్‌లో షెకావత్



'పార్టీ లేదా పుష్ప' అంటూ 'పుష్ప' చిత్రంలో ఫహద్ ఫాజిల్ చెప్పిన డైలాగ్ ఎంతగా పాపులర్ అయిందో తెలిసిందే. మలయాళ నటుడే అయినా తెలుగులోనూ ఆయన మంచి గుర్తింపును అందుకున్నారు. ఫహద్ ఫాజిల్ పుట్టిన రోజు సందర్భంగా 'పుష్ప 2 ద రూల్' నుంచి కొత్త పోస్టర్ తో తనకు బర్త్ డే విషెస్ ను అంద జేశారు దర్శక నిర్మాతలు. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకొని స్టైలిష్ గా సిగరెట్ తాగుతూ కనిపిస్తున్న ఫహద్ పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది.అలాగే ఈ చిత్రంలో ఫహద్ క్యారెక్టర్ ఎలా ఉంటుందో తెలియజేశారు మేకర్స్. 'ఈసారి ఆయన ప్రతీకారం తీర్చుకోడానికి వస్తున్నాడు' అంటూ ఫహద్ ఫాజిల్ ఫోటోకు క్యాప్షన్ ఇచ్చారు. 'పుష్ప ది రైజ్' లో అల్లు అర్జున్, ఫహద్ మధ్య పోటాపోటీగా సాగే సీన్స్.. 'పుష్ప 2 దిరూల్'పై అంచనాలు పెంచాయి. అలాగే ఇటీవల అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన 'వేర్ ఈజ్ పుష్ప' అనే కాన్సెప్ట్ వీడియో కూడా సినిమాపై ఆసక్తిని పెంచింది. 'అడవిలో జంతువులు రెండు అడుగులు వెనక్కు వేసాయంటే పులి వచ్చింది అని అర్థం.. అదే పులి రెండు అడుగులు వెనక్కు వేసిందంటే పుష్ప వచ్చుండాడు అని అని అర్థం' అని బన్నీ డైలాగ్ ఆ వీడియోకు హైలైట్‌గా నిలిచింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.